## థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరాలో కొరత ఉండొద్దు






జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## ఆదిలాబాద్
మంచిర్యాల-కుమరం భీం-నిర్మల్
బుధవారం 2 సెప్టెంబర్ 2026 పేజీలు : 8

# గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

- గణపతి మండపాల వద్ద సీ సీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలి నాణ్యమైన వస్తువులను మండల నిర్మాణానికి వినియోగించాలి
- అధిక శబ్దం వచ్చే డీజేలకు అనుమతులు లేవు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్
- వినాయక చవితి, నవరాత్రులు, నిమజ్జనం రోజు మండప నిర్వహణ జాగ్రత్తలు పాటించాలి
- యువత నవరాత్రులలో గణపతి దీక్షలో పాల్గొనాలి సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దు






## ఎస్సీ ఓట్లు కావాలి.. హక్కులు మాత్రం వద్దా?



## పెండింగ్ భూ సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించాలి

నిర్మల్ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను ప్రాధా న్యతా క్రమంలో వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మంది రంలో భూభారతి, భూముల సర్వే--రీ-సర్వే, నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ,



# ఎస్సీ ఓట్లు కావాలి.. హక్కులు మాత్రం వద్దా?

## మోదీ సర్కార్‌పై శ్యామ్ నాయక్, సుగుణ ధ్వజం

### ఒకే దేశం.. ఒకే ఎన్నిక' అంటున్నారు.. ఒకే దేశం.. సమాన విద్య' ఎందుకు కాదు?

**ఆసిఫాబాద్ ఆర్సీ,సెప్టెంబర్ 01 (ప్రజాజ్యోతి):** ఎన్నికలు సమీపించిన ప్రతిసారీ ఎస్సీ బలహీన వర్గాల ప్రజల ఓట్ల కోసం హామీలు ఇచ్చే కేంద్ర ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చిన తర్వాత వారి సమస్యలు, హక్కులను పట్టించుకోవడం లేదని ఆసిఫాబాద్ జిల్లా నియోజకవర్గ ఇంచార్జి శ్యామ్ నాయక్, డీసీసీ జిల్లా అధ్యక్షురాలు సుగుణ తీవ్రంగా విమర్శించారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని వారు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో ఒకే దేశం.. ఒకే ఎన్నిక అనే నినాదాన్ని ముందుకు తీసుకెళ్తున్న కేంద్ర ప్రభుత్వం.. దేశంలోని పేదలు, దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాల పిల్లలకు సమాన స్థాయిలో విద్య అందించేందుకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఒకే దేశం.. ఒకే ఎన్నిక' కంటే ముందు ఒకే దేశం.. సమాన విద్య.. సమాన అవకాశాలు.. సమాన హక్కులు' అనే విధానం అవసరమని అన్నారు. ఓట్లప్పుడు గుర్తొస్తారు.. హక్కుల విషయంలో ఎందుకు కాదు? ఎస్సీ వర్గాల ప్రజలు దేశ జనాభాలో కీలక భాగమని, వారి అభివృద్ధి లేకుండా దేశ ప్రగతి పూర్తికాదని శ్యామ్ నాయక్, సుగుణ అన్నారు. ఎన్నికల సమయంలో వారి ఓట్లు అత్యంత విలువైనవిగా భావించే రాజకీయ వ్యవస్థ.. వారి విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధి, సామాజిక భద్రత వంటి అంశాలపై కూడా అదే స్థాయిలో దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఫీజులు, వసతి, పుస్తకాలు, ప్రయాణం వంటి ఖర్చులు వారి చదువుకు ఆటంకంగా మారుతున్నాయని తెలిపారు. ప్రతి పేద విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వాలు బలమైన విధానాలను అమలు చేయాలని కోరారు.

**రిజర్వేషన్లను కాపాడాలి**

ఎస్సీ వర్గాలకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లు, హక్కులను పరిరక్షించాల్సిన అవసరం ఉందని వారు అన్నారు. విద్య, ఉద్యోగాలు, ఉపాధి రంగాల్లో వెనుకబడిన వర్గాలకు లభిస్తున్న అవకాశాలు తగ్గకుండా చూడాలని కోరారు. సామాజికంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఉద్దేశించిన సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా పర్యవేక్షణ ఉండాలని సూచించారు. విద్యలో అసమానతలు తొలగించాలి దేశంలో ఆర్థిక స్థోమత ఆధారంగా విద్యలో అంతరాలు పెరగకుండా చూడాలని శ్యామ్ నాయక్, సుగుణ అన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలు కూడా నాణ్యమైన విద్య పొందే హక్కు కలిగి ఉన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థలను మరింత బలోపేతం చేసి.. పేద విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులు,



ఉపాధ్యాయులు, సాంకేతిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని అన్నారు. విద్యలో వెనుకబడిన వర్గాల పిల్లలకు ప్రత్యేక ప్రోత్సాహం అందించాలని కోరారు.

**ఉపాధి అవకాశాలు కల్పించాలి**

విద్యతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వాల ప్రధాన బాధ్యత అని వారు అన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, నైపుణ్య శిక్షణ, స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ యువత ఆర్థికంగా ఎదిగేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కేవలం ఎన్నికల సమయంలో సభలు, సమావేశాలు నిర్వహించి హామీలు ఇవ్వడం కాకుండా.. అధికారంలో ఉన్న సమయంలో వాటిని అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వాలు జవాబుదారీగా వ్యవహరించాలని అన్నారు. ప్రజలే తగిన సమాధానం చెబుతారు ప్రజా సమస్యలను విస్మరించి పాలన సాగించే ప్రభుత్వాలకు ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పు తప్పదని శ్యామ్ నాయక్, సుగుణ హెచ్చరించారు. ప్రతి వర్గం ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ఎస్సీ వర్గాలను కేవలం ఓటు బ్యాంకుగా చూడకుండా.. వారిని సమాజంలో సమాన భాగస్వాములుగా గుర్తించి వారి హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఓట్లు అడిగే హక్కు రాజకీయ పార్టీలకు ఉన్నట్లే.. తమ హక్కులను ప్రశ్నించే హక్కు ప్రజలకు కూడా ఉందని వారు పేర్కొన్నారు. దేశ అభివృద్ధి అంటే కొందరి అభివృద్ధి కాదని, అట్టడుగు వర్గాల నుంచి అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందడమే నిజమైన అభివృద్ధి అని అన్నారు. ఎస్సీ వర్గాలకు సామాజిక న్యాయం, సమాన విద్య, ఉపాధి, ఆర్థిక అవకాశాలు కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని శ్యామ్ నాయక్, సుగుణ డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఎస్సీ ఓట్లు కావాలి.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్సీల హక్కులు మాత్రం వద్దా? ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారు. సరైన సమయంలో ప్రజలే తమ తీర్పుతో సమాధానం చెబుతారు" అని వారు స్పష్టం చేశారు.

## అర్హులైన ప్రతి ఓటరుకు న్యాయం జరగాలి

### నో మ్యాపింగ్‌పై గులాం జావీద్ చొరవ

**ఆసిఫాబాద్ , సెప్టెంబర్ 1 ప్రజా జ్యోతి** అర్హత కలిగిన ప్రతి ఓటరుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వార్డు సభ్యుల జిల్లా కన్వీనర్ గులాం జావీద్ కోరారు. రాజంపేట గ్రామపంచాయతీ పరిధిలోని పీయస్ నం.225లో సర్ ప్రక్రియలో భాగంగా నిర్వహించిన నో మాపింగ్ హియరింగ్ లో ఆయన ప్రత్యేకంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నో మాపింగ్ జాబితాలో ఉన్న ఓటర్ల సమస్యలను గులాం జావీద్ స్వయంగా పరిశీలించి, వారి నుంచి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం రెవెన్యూ అధికారులతో చర్చించి, అర్హులైన ఓటర్ల పేర్లు ఎలాంటి కారణాలతోనూ తొలగిపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సర్ ప్రక్రియలో ఓటర్లకు



ఎదురవుతున్న సమస్యలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరి ఓటు హక్కు సురక్షితంగా ఉండేలా చూడాలని ఆయన సూచించారు. ప్రజల సమస్యలు, ఓటర్ల హక్కుల పరిరక్షణకు తాను నిరంతరం అందుబాటులో ఉంటానని గులాం జావీద్ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి శ్రీనివాస్, బిఎల్ఓ భాగ్యలక్ష్మితో పాటు పలువురు ఓటర్లు పాల్గొన్నారు.

## ప్రజా ప్రయోజనమే లక్ష్యంగా వార్తలు అందించాలి

### మనమంతా ఒక్కటిగా నిలుద్దాం



**ఆసిఫాబాద్ ఆర్సీ,సెప్టెంబర్ 01 (ప్రజాజ్యోతి):** మన ఊరు మన బాధ్యత.. మన సమస్యలు మనందరి సమస్యలు. గ్రామ అభివృద్ధి ఒక్కరి వల్ల సాధ్యం కాదు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, యువత కలిసి పనిచేసినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుంది. రైతుల సమస్యలకు పరిష్కారం లభించాలి. పేదలకు ప్రభుత్వ పథకాలు అర్హత మేరకు అందాలి. విద్యార్థులకు మంచి విద్య, యువతకు ఉపాధి అవకాశాలు, గ్రామాలకు మెరుగైన రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు వంటి మౌలిక వసతులు అందాలి. ప్రజాప్రతినిధులు పదవి అనేది అధికారం కోసం కాదు.. ప్రజలకు సేవ చేయడానికి వచ్చిన బాధ్యతగా భావించాలి. అధికారులు ప్రజల సమస్యలను సానుకూలంగా స్వీకరించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేయాలి. యువత సామాజిక బాధ్యతతో ముందుకు రావాలి. గ్రామంలో మంచి పనులను ప్రోత్సహిస్తూ, సమస్యలపై ప్రశాంతంగా మరియు ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రశ్నించాలి. జర్నలిస్టులు కూడా ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. వాస్తవాలను పరిశీలించి, ఎవరికీ అన్యాయం జరగకుండా ప్రజా ప్రయోజనమే లక్ష్యంగా వార్తలు అందించాలి. ప్రశ్నించే ప్రజలు ఉంటేనే పాలనలో జవాబుదారీతనం పెరుగుతుంది. నిజాయితీగా పనిచేసే నాయకత్వం ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుంది. అందరం కలిసి ముందడుగు వేస్తేనే మన గ్రామం మన మండలం మరింత అభివృద్ధి చెందుతుంది.ప్రజా ప్రయోజనం ముందు.. వ్యక్తిగత ప్రయోజనం తర్వాత. మన ఊరి అభివృద్ధి కోసం మనమంతా ఒక్కటిగా నిలుద్దాం!.

## ప్రైవేట్ ఆస్పత్రుల్లో డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీలు



**మంచిర్యాలరూరల్ సెప్టెంబర్01 (ప్రజాజ్యోతి)** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ మంగళవారం మంచిర్యాల పట్టణంలోని నాలుగు ప్రైవేట్ ఆస్పత్రులను ఆకస్మికంగా తనిఖీ చేశారు.మంచి ర్యాల నగరంలోని సిటీ న్యూరో శ్రీహర, ఆదిత్య, సచిన్ తదితర ఆస్పత్రుల్లో వైద్య సేవలు,రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు.సీఎం రిలీఫ్ ఫండ్‌కు సంబంధించిన వైద్య బిల్లులను కూడా తనిఖీ చేశారు.క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ నిబంధనల ప్రకారం అన్ని ఆస్పత్రులు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు.వైద్యులు, స్పెషలిస్టుల వివరాలు, వైద్య చార్జీలను ప్రదర్శించడంతో పాటు తాగునీరు,వీల్‌చైర్లు, స్ట్రెచర్లు అందుబాటులో ఉంచాలన్నారు.ఫైర్ సేఫ్టీ, బయోమెడికల్ వేస్ట్ నిర్వహణ నిబంధనలు పాటించాలని ఆదేశించారు. డెంగ్యూపై రోగులను భయభ్రాంతులకు గురిచేయకుండా అవగాహన కల్పించాలని సూచించారు. తనిఖీ చేసిన ఆస్పత్రుల్లో వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు.

# సెప్టెంబర్ నుంచి శ్రీరాంపూర్ ఏరియాలో ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుంది

**ఆగస్టులో మెరుగైన ఉత్పత్తి.. భూగర్భ గనుల్లో 96 శాతం సాధన**

**ఎస్ఆర్పీ-1 గనికి సెప్టెంబర్ 2న స్వర్ణోత్సవాలు శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్**




**మంచిర్యాల, 1, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** శ్రీరాంపూర్ ఏరియా లో జూలై మాసంతో పోల్చితే శ్రీరాంపూర్ ఏరియా పరిధిలోని అన్ని భూగర్భ, ఉపరితల గనుల్లో ఆగస్టు మాసంలో ఉత్పత్తి గణనీయంగా మెరుగుపడిందని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఏరియా ఉత్పత్తి పరిస్థితి, రానున్న నెలల్లో ఉత్పత్తి పెంపునకు చేపడుతున్న చర్యలు, ఎస్ఆర్పీ-1 గని స్వర్ణోత్సవాలు, ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలను వెల్లడించారు. శ్రీరాంపూర్ ఏరియాకు ఆగస్టు నెలలో 4,09,000 టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం నిర్దేశించగా, 3,33,074 టన్నుల ఉత్పత్తి సాధించినట్లు జీఎం మునిగంటి శ్రీనివాస్ తెలిపారు. ఏరియాలోని భూగర్భ గనుల్లో ఎస్ఆర్పీ-1 గని 112 శాతం, ఆర్కే-7 గని 100 శాతం, ఆర్కే-ఎన్టీ గని 102 శాతం, ఎస్ఆర్పీ-3, 3ఏ గనులు 100 శాతం ఉత్పత్తి సాధించాయని చెప్పారు. ఈ నాలుగు భూగర్భ గనులు వంద శాతం రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాయని తెలిపారు. అదేవిధంగా ఆర్కే-5 ఇంక్లైన్, ఐకే-1ఏ గనులు స్వల్పంగా వెనుకబడినప్పటికీ, మొత్తంగా శ్రీరాంపూర్ ఏరియాలోని భూగర్భ గనులు 96 శాతం ఉత్పత్తి సాధించాయని జీఎం వెల్లడించారు.

**రెండు కొత్త కాంట్రాక్టులతో ఎస్ఆర్పీ ఓసీలో ఉత్పత్తి మెరుగుదల**

ఎస్ఆర్పీ ఓపెన్‌కాస్ట్ గనిలో రెండు కాంట్రాక్టులు ప్రారంభం కావడంతో ఉత్పత్తి గణనీయంగా మెరుగుపడిందని మునిగంటి శ్రీనివాస్ తెలిపారు. వర్షాల కారణంగా వంద శాతం ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోలేకపోయినప్పటికీ, సెప్టెంబర్ నుంచి ఆశించిన స్థాయిలో ఉత్పత్తి పెరుగుతుందని అన్నారు.అటు ఐకే ఓపెన్‌కాస్ట్ గనిలో కూడా సెప్టెంబర్ 1 నుంచి కొత్త కాంట్రాక్టు ప్రారంభమవుతుందని తెలిపారు. దీంతో అక్కడ కూడా ఉత్పత్తి పెరిగి, ఇప్పటివరకు వెనుకబడిన ఉత్పత్తిని భర్తీ చేయడంతో పాటు వంద శాతం ఉత్పత్తి సాధించే అవకాశం ఉందని తెలిపారు. సెప్టెంబర్ నుంచి శ్రీరాంపూర్ ఏరియాలో భూగర్భ గనులతో పాటు ఉపరితల గనుల్లోనూ ఉత్పత్తి గణనీయంగా పెరిగే అవకాశం ఉందని మునిగంటి శ్రీనివాస్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన వంద శాతం ఉత్పత్తి లక్ష్యాలను సాధించే అవకాశం ఉందని తెలిపారు.

**ఎస్ఆర్పీ-1 గనికి 50 ఏళ్ల ప్రస్థానం**

సెప్టెంబర్ 2, 2026న ఎస్ఆర్పీ-1 భూగర్భ గని 50 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా స్వర్ణోత్సవాలను నిర్వహిస్తున్నట్లు జీఎం మునిగంటి శ్రీనివాస్ తెలిపారు. 1976 సెప్టెంబర్ 2న ప్రారంభమైన ఎస్ఆర్పీ-1 గనిలో 1978లో బొగ్గు ఉత్పత్తి ప్రారంభమైందని, ఐదు దశాబ్దాలుగా నిరంతరంగా బొగ్గు ఉత్పత్తి చేస్తూ శ్రీరాంపూర్ ఏరియా అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తోందని తాజా వివరాలు కూడా వెల్లడిస్తున్నాయన్నారు .50 ఏళ్లు పూర్తి చేసుకోవడమే కాకుండా ఉత్పత్తిలోనూ ఎస్ఆర్పీ-1 గని మంచి రికార్డులు సాధించడం గర్వకారణమని మునిగంటి శ్రీనివాస్ అన్నారు. ఈ ఘనత గనిలో గతంలో పనిచేసిన ఉద్యోగులు, అధికారులు, ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులు, అధికారుల సమష్టి కృషి వల్లే సాధ్యమైందని తెలిపారు. గని భద్రతలోనూ పలు అవార్డులు సాధించిందని, వరుసగా భద్రతా పక్షోత్సవాల్లో బహుమతులు సాధించడంతో పాటు జాతీయ స్థాయిలోనూ గుర్తింపు పొందిందని తెలిపారు. ఇటీవల గని మూసివేతపై ఏర్పడిన పరిస్థితుల నేపథ్యంలో ఏరియా యాజమాన్యం ప్రత్యేకంగా అధ్యయనం చేసి సీమ్-1, సీమ్-2 ఉత్తర భాగంలో మిగిలిన బొగ్గును వెలికితీయాలని నిర్ణయించడంతో గని జీవితకాలం మరో మూడు నుంచి నాలుగు సంవత్సరాలు పెరిగిందన్నారు .ఎస్ఆర్పీ-1 గని ఉద్యోగులకు ఈ సందర్భంగా అభినందనలు తెలిపిన జీఎం మునిగంటి శ్రీనివాస్, సెప్టెంబర్ 2న నిర్వహించే స్వర్ణోత్సవ కార్యక్రమాల్లో ఉద్యోగులు, అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

**3,856 మందికి డిపెండెంట్ ఉద్యోగాలు**

శ్రీరాంపూర్ ఏరియాలో మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన ఉద్యోగుల వారసులకు ఇప్పటివరకు 3,856 మందికి డిపెండెంట్ ఉద్యోగాలు కల్పించినట్లు జీఎం మునిగంటి శ్రీనివాస్ తెలిపారు. ఉద్యోగుల సంక్షేమానికి సంస్థ ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు .అదేవిధంగా 281 మంది ఉద్యోగులకు ఎల్ఎస్పీ (ఎల్ఎస్పీ) చెల్లింపులు, 30 మంది ఉద్యోగులకు ఎంఎంసీ (ఎంఎంసీ) చెల్లింపులు చేసినట్లు తెలిపారు.

**9,790 మంది రిటైర్డ్ ఉద్యోగులకు మెడికల్ కార్డులు**

శ్రీరాంపూర్ ఏరియాలో ఉద్యోగ విరమణ పొందిన 9,790 మంది ఉద్యోగులకు సీపీఆర్ఎంఎస్ (సీపీఆర్ఎంఎస్) కింద ఇప్పటివరకు మెడికల్ కార్డులు అందజేసినట్లు జీఎం మునిగంటి శ్రీనివాస్ వెల్లడించారు. ఉద్యోగులు, వారి కుటుంబాల సంక్షేమంతో పాటు పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు వైద్య సదుపాయాలు అందించడంపై యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు ఉత్పత్తి పెంపుతో పాటు గనుల్లో భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని శ్రీరాంపూర్ ఏరియాను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు కొనసాగుతున్నాయని జీఎం మునిగంటి శ్రీనివాస్ తెలిపారు. సెప్టెంబర్ నుంచి భూగర్భ, ఉపరితల గనుల్లో ఉత్పత్తి మరింత పెరిగి, ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశం లో ఎస్ ఓ టూ జీఎం కృష్ణ ప్రసాద్, డీజీఎం(పర్సనల్) ఎస్ . అనిల్ కుమార్,డీజీఎం(ఐఈడీ) రాజన్న, డిప్యూటీ పి.ఎం (పర్సనల్) కే క్రాంతి కుమార్‌లు పాల్గొన్నారు.

## పంగిడి మాదారా దవాఖానకు షెడ్ నిర్మించాలి

**మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు సర్పంచుల వినతి**



**తిర్యాణి, సెప్టెంబర్ 1 (ప్రజా జ్యోతి):** పంగిడి మాదారా పల్లె దవాఖానలో షెడ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు, మందగూడ సర్పంచ్ తుంరం గోపాల్, పంగిడి మాదారా సర్పంచ్ ఆత్రం రాధ మంగళవారం మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కును కలిసి వినతిపత్రం అందజేశారు.దవాఖానకు పరిసర గ్రామాల నుంచి నిత్యం అనేక మంది రోగులు, వారి సహాయకులు వైద్యం కోసం వస్తుంటారని తెలిపారు. దవాఖాన ఆవరణలో షెడ్ సౌకర్యం లేకపోవడంతో వైద్యం కోసం వచ్చిన వారు ఎండ, వర్షాల సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. రోగులు, వారి సహాయకుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని దవాఖాన వద్ద షెడ్ నిర్మాణం చేపట్టడం అవసరమని పేర్కొన్నారు.ప్రజల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని షెడ్ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరయ్యేలా సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కును కోరారు. దీనిపై స్పందించిన ఆత్రం సక్కు దవాఖాన వద్ద షెడ్ నిర్మాణానికి అవసరమైన నిధుల విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి, నిధులు మంజూరయ్యేలా తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆస్ట్రేలియాలో కీలక ఖనిజ రంగంలోకి సింగరేణికి ఆహ్వానం

## సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతితో మోనాష్ యూనివర్సిటీ ప్రతినిధుల భేటీ



**మంచిర్యాల, 1, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** కీలక ఖనిజాలు పుష్కలంగా ఉన్న ఆస్ట్రేలియాలో క్రిటికల్ మినరల్స్ రంగంలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ భాగస్వామ్యంతో పనిచేయాలని మోనాష్ యూనివర్సిటీ ఆహ్వానం పలికింది. ఈ మేరకు మోనాష్ యూనివర్సిటీ ప్రతినిధి బృందం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సంస్థ సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతితో సమావేశమయ్యారు . ఆస్ట్రేలియాలో క్రిటికల్ మినరల్స్ రంగంలో ఉన్న అవకాశాలను మోనాష్ యూనివర్సిటీ ప్రతినిధులు సింగరేణి సీఎండీకి వివరించారు. తమ దేశం క్రిటికల్ మినరల్స్ రంగంలో అంతర్జాతీయ సంస్థల భాగస్వామ్యాన్ని కోరుకుంటోందని, మైనింగ్ రంగంలో విశేష అనుభవం కలిగిన సింగరేణి సంస్థను పరస్పర లాభదాయక భాగస్వామ్యం కోసం ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా క్రిటికల్ మినరల్స్‌కు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పర్యావరణహిత మైనింగ్ విధానాలు, లాభదాయక వ్యూహాత్మక వ్యాపార కార్యకలాపాలకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని మోనాష్ యూనివర్సిటీ బృందం తెలిపింది. పరిశోధన, విద్య, పరిశ్రమలతో భాగస్వామ్యం, పరిశోధన ఫలితాలను వాణిజ్యపరమైన సాంకేతిక పరిష్కారాలుగా మార్చడంలో తమకు ఉన్న అనుభవాన్ని వివరించారు . క్రిటికల్ మినరల్స్ అన్వేషణ, వెలికితీత, ప్రాసెసింగ్, రిఫైనింగ్‌తో పాటు విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీలో ఉన్న అవకాశాలపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ముడి ఖనిజాల వెలికితీతకే పరిమితం కాకుండా డౌన్‌స్ట్రీమ్ ప్రాసెసింగ్, రిఫైనింగ్ ద్వారా అదనపు విలువను సృష్టించే అవకాశాలను మోనాష్ యూనివర్సిటీ ప్రతినిధులు వివరించారు. మైనింగ్ రంగంలో సుస్థిరత, పర్యావరణహిత విధానాలు, గని మూసివేత ప్రణాళిక, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యం కలిగిన మానవ వనరుల అభివృద్ధి తదితర అంశాల్లో తమ సేవలను వినియోగించుకోవాలని వారు సూచించారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కీలక ఖనిజ రంగంలోకి ప్రవేశించేందుకు సింగరేణి చేపడుతున్న చర్యలను సంస్థ అధికారులు మోనాష్ యూనివర్సిటీ ప్రతినిధులకు వివరించారు. ఇటీవలే కర్ణాటకలో బంగారం--రాగి గనుల అన్వేషణను ప్రారంభించినట్లు తెలిపారు. క్రిటికల్ మినరల్స్ రంగంలో పరస్పర లాభదాయక భాగస్వామ్యానికి అంతర్జాతీయంగా ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నామని సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి తెలిపారు. మోనాష్ యూనివర్సిటీ--సింగరేణి మధ్య పరిశోధన, ఆధునిక సాంకేతికత, క్రిటికల్ మినరల్స్, నైపుణ్యాభివృద్ధి తదితర అంశాల్లో భవిష్యత్ సహకార అవకాశాలను పరిశీలిస్తామని చెప్పారు. త్వరలో సింగరేణి ఉన్నతస్థాయి అధికారుల బృందాన్ని ఆస్ట్రేలియాకు పంపించి అక్కడి అవకాశాలను పరిశీలిస్తామని తెలిపారు .ఈ సమావేశంలో సింగరేణి భవన్ నుంచి డైరెక్టర్ (పర్సనల్, ఫైనాన్స్) గౌతమ్ పోట్రు, జీఎం (కోఆర్డినేషన్, మార్కెటింగ్) టి. శ్రీనివాస్, కొత్తగూడెం కార్పొరేట్ కార్యాలయం నుంచి డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్వీ సూర్యనారాయణ, డైరెక్టర్ (పీపీ) కె. వెంకటేశ్వర్లు, జీఎం (బీడీ) రాందాస్, జీఎం (ఎక్స్‌ప్లోరేషన్) పంకజ్ కులశ్రేష్ట, మోనాష్ యూనివర్సిటీ ప్రొఫెసర్ యానిస్ వెంటికోస్ తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలకు బానిస కావద్దు.. స్వేచ్ఛా జీవితాన్ని ఎంచుకోండి

**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథో**

**ఐటీఐ విద్యార్థులకు మానసిక ఆరోగ్యం, డ్రగ్స్ అడిక్షన్‌పై అవగాహన**




**మంచిర్యాల, 1, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** మాదకద్రవ్యాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని, స్వేచ్ఛాయుతమైన ఆరోగ్యకరమైన జీవితాన్ని ఎంచుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ విద్యార్థులకు సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలన, మానసిక ఆరోగ్యంపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలను ప్రతి నెల నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ తెలిపారు. మంచిర్యాల అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఐటీఐ)లో విద్యార్థులకు మానసిక ఆరోగ్యం, మాదకద్రవ్యాల వినియోగం, వాటి వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమంను మంగళవారం నిర్వహించారు. ఐటీఐ ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపల్ సునీల్‌తో కలిసి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 400 మంది ఐటీఐ విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మోటివేషనల్ స్పీచ్ ద్వారా డ్రగ్స్‌కు దూరంగా ఉండాల్సిన అవసరాన్ని వివరించారు. మాదకద్రవ్యాలు ఆరోగ్యాన్ని మాత్రమే పాడుచేయవని, వ్యక్తిలోని సామర్థ్యం, శక్తి, జ్ఞానాన్ని క్రమంగా నశింపజేస్తాయని డాక్టర్ నరేందర్ రాథోడ్ వివరించారు. డ్రగ్స్ వినియోగం కుటుంబ సభ్యులు, స్నేహితులు, సమాజంతో ఉన్న సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపడంతో పాటు భవిష్యత్తును కూడా నాశనం చేసే ప్రమాదం ఉందన్నారు. మాదకద్రవ్యాల మత్తు స్వల్పకాలిక సమస్యగా కనిపించినప్పటికీ దీర్ఘకాలంలో ఊపిరితిత్తులు, కాలేయం తదితర అవయవాలపై తీవ్ర ప్రభావం చూపి అనారోగ్య సమస్యలకు దారితీస్తుందని తెలిపారు. మాదకద్రవ్యాలను వినియోగించడం వల్ల వ్యక్తి తనపై తాను నియంత్రణ కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని, క్రమంగా వాటికి బానిసగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. డ్రగ్స్ వ్యసనం విద్యార్థుల చదువు, ఉద్యోగ అవకాశాలు, విజయావకాశాలను దెబ్బతీయడమే కాకుండా చట్టపరమైన సమస్యలకు కూడా కారణమవుతుందని పేర్కొన్నారు. చట్టవిరుద్ధమైన మాదకద్రవ్యాలను కలిగి ఉన్నా, వినియోగించినా ఎదురయ్యే చట్టపరమైన పరిణామాల గురించి విద్యార్థులు తెలుసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాలు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చి చదువుకుంటున్న విద్యార్థులు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా జాగ్రత్తగా ఉండాలని డీఎంహెచ్ఓ సూచించారు. స్నేహితులతో కలిసి తిరిగే సమయంలో చెడు అలవాట్లు, చెడు ఆలోచనలకు దూరంగా ఉండాలని, తాత్కాలిక ఆనందం కోసం తీసుకునే తప్పుడు నిర్ణయాలు భవిష్యత్తును నాశనం చేసే అవకాశం ఉందని హెచ్చరించారు. తమ లక్ష్యాలను చేరుకునేందుకు ఆరోగ్యం, మానసిక ప్రశాంతతకు ప్రాధాన్యత ఇవ్వాలని విద్యార్థులకు వివరించారు . విద్యార్థుల్లో మానసిక పరివర్తనలో మార్పులు కనిపించినా, ఎలాంటి మానసిక సమస్యలు ఎదురైనా వాటిని నిర్లక్ష్యం చేయకుండా నిపుణులను సంప్రదించాలని తెలిపారు. ఉచిత మానసిక ఆరోగ్య కౌన్సిలింగ్ కోసం టెలీ-మానస్ 14416 నంబర్‌కు ఫోన్ చేసి నిపుణుల సలహాలు, కౌన్సిలింగ్ పొందవచ్చని వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మానసిక వైద్య నిపుణులను అందుబాటులో ఉంచిందని, విద్యార్థులు మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంచుకొని అవసరమైన సమయంలో సహాయం పొందాలని సూచించారు. విద్యార్థుల సమస్యలను తెలుసుకునేందుకు లెక్చరర్లు, ఉపాధ్యాయులు వారితో సమన్వయం చేసుకుంటూ వారి ఆలోచనలు, సమస్యలను వినాలని, అవసరమైన పరిష్కార మార్గాలను చూపించాలని కార్యక్రమంలో సూచించారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల నిర్మూలన కోసం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అనిల్, మానసిక వైద్య నిపుణులు డాక్టర్ సునీల్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, అల్లాడి శ్రీనివాస్, రషీద్, సీహెచ్ఓలు నాందేవ్, కాకిరాల వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, పున్నమయ్య, ఆప్తాలమిక్ అధికారి శంకర్, ఐటీఐ సిబ్బంది, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో చేసిందేమీ లేదు

## కాంగ్రెస్ వెయ్యి రోజుల్లో సంక్షేమ విప్లవం..హామీలు మరిచిన బీఆర్ఎస్‌కు ప్రశ్నించే హక్కు లేదు

## ముందుగా పదేళ్ల పాలనకు లెక్క చెప్పండి..డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క

**ఆసిఫాబాద్ సెప్టెంబర్ 1 ప్రజా జ్యోతి** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క, ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాంనాయక్ బీఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదని, అనేక హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా ప్రజలను మభ్యపెట్టిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల మధ్య ఉంటూ సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని తెలిపారు.

**సంక్షేమ పథకాలతో ప్రజలకు భరోసా**

మహాలక్ష్మి, రూ.500కే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి, సన్నబియ్యం, కొత్త రేషన్ కార్డులు, రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, ఆరోగ్యశ్రీ, విద్య, వైద్యం, ఉద్యోగాల కల్పన వంటి కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని సుగుణక్క పేర్కొన్నారు. పేదల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు."హామీలు ఇచ్చి మరిచిపోయే ప్రభుత్వం కాంగ్రెస్ కాదు" అని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం చేసిన అప్పులను తీర్చడంతో పాటు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజలు ఏళ్ల తరబడి ఎదురుచూసినా పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన కుటుంబాలకు రేషన్ కార్డులు అందించే ప్రక్రియ చేపట్టిందన్నారు.

**ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల**

పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని సుగుణక్క తెలిపారు. డబుల్ బెడ్రూం ఇళ్ల పేరుతో గత ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టిందని విమర్శించారు. పేదలకు సన్నబియ్యం అందిస్తూ ఏ కుటుంబం కూడా ఆకలితో ఉండకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

**ముందుగా పదేళ్ల పాలనకు లెక్క చెప్పండి**

కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై ప్రశ్నించే ముందు బీఆర్ఎస్ నేతలు తమ పదేళ్ల పాలనకు లెక్క చెప్పాలని సుగుణక్క డిమాండ్ చేశారు. "ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారు? ఎన్ని ఇళ్లు నిర్మించారు? ఎన్ని కొత్త రేషన్ కార్డులు ఇచ్చారు? ప్రజలకు ఎన్ని సంక్షేమ పథకాలు సమర్థంగా అందించారు?" అని ప్రశ్నించారు.ప్రజల మధ్య ఉంటూ కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుంటే, గత బీఆర్ఎస్ పాలనలో కీలక నేతలు ప్రజలకు దూరంగా ఉన్నారని విమర్శించారు. ప్రజా సమస్యలను పట్టించుకోకుండా ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు.



**ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆరోపణలకు కౌంటర్**

కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో ఏమీ చేయలేదంటూ ఎమ్మెల్యే కోవ లక్ష్మి చేసిన ఆరోపణలను సుగుణక్క తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల్లో ఏం చేసిందో ప్రజలకు తెలుసని, సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల రూపంలో వాటి ఫలాలు ప్రజలకు అందుతున్నాయని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు చేపట్టాలని బీఆర్ఎస్ శ్రేణులకు కోవ లక్ష్మి పిలుపునివ్వడంపై స్పందిస్తూ.. "జిల్లాల్లో నిరసనలు చేయడం కాదు.. ముందుగా కేసీఆర్ ఫామ్‌హౌస్ ముందు నిరసనలు చేయండి" అని సుగుణక్క అన్నారు.

**ప్రతిపక్ష నాయకుడిగా కేసీఆర్ విఫలం**

ప్రతిపక్ష నాయకుడిగా కేసీఆర్ పూర్తిగా విఫలమయ్యారని సుగుణక్క ఆరోపించారు. ప్రజలు ప్రతిపక్ష నాయకుడిగా ఎన్నుకున్న వ్యక్తి అసెంబ్లీలో ప్రజా సమస్యలను ప్రస్తావించడం, ప్రభుత్వానికి అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వడం బాధ్యత అని అన్నారు.ప్రతిపక్ష నాయకుడిగా కేసీఆర్‌కు ప్రభుత్వం నుంచి అన్ని సదుపాయాలు, జీతభత్యాలు అందుతున్నప్పటికీ ఆ హోదాకు ఉన్న బాధ్యతను నిర్వర్తించడం లేదని విమర్శించారు. అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలను ప్రస్తావించకుండా ఫామ్‌హౌస్‌కే పరిమితం కావడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.బీఆర్ఎస్ శ్రేణులకు నిజంగా ప్రజా సమస్యలపై పోరాడాలనే చిత్తశుద్ధి ఉంటే జిల్లాల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు చేయడం కంటే ముందుగా కేసీఆర్ ఫామ్‌హౌస్ ముందు నిరసన చేపట్టి ఆయనను ప్రజల మధ్యకు, అసెంబ్లీకి తీసుకురావాలని సూచించారు.

**బలహీన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులు, బలహీన వర్గాలు, నిరుద్యోగులు, పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని సుగుణక్క తెలిపారు. విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు, అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లు, క్రీడలకు ప్రోత్సాహం వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు."పేదలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది" అనే లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజల మధ్య ఉంటూ పనిచేస్తున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణను మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజా సంక్షేమాన్ని మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు.

**ఆసిఫాబాద్‌లో అభివృద్ధికి పెద్దపీట: శ్యామ్ నాయక్**

ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాంనాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు వేలాది ఇందిరమ్మ ఇళ్లకు మంజూర్లు ఇచ్చామని తెలిపారు.రోడ్లు, తాగునీరు, విద్య, వైద్యం వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు గమనిస్తున్నారని, ప్రతిపక్షాల విమర్శలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని శ్యాంనాయక్ అన్నారు.ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల మంగ, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు హర్షద్, పంచాయతీరాజ్ సంఘటన్ జిల్లా కోఆర్డినేటర్ కోవా ఇందిరా, డీసీసీ కార్యవర్గ సభ్యులు, వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళా విభాగం సభ్యులు, ఇందిరా ఫెలోషిప్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావును అరెస్టు చేసిన హైదరాబాద్ పోలీసులు

### రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన బీజేపీ సీనియర్ నాయకుడు తుల మధుసూదన్‌రావు

**మంచిర్యాల, 1, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావును హైదరాబాద్ పోలీసులు ఆయన స్వగృహంలో అరెస్టు చేసి గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న మంచిర్యాల జిల్లా నుంచి భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు తుల మధు సూదన్‌రావు గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావును కలిశారు. ఈ సందర్భంగా ఎన్. రామచంద్ర రావు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ భారతీయ జనతా పార్టీకి పెరుగుతున్న ప్రజాదరణను, ఎదురుగాలిని ఓర్వలేక అణచివేత చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. అణచివేతలో భాగంగానే బీజేపీ పార్టీ కార్యాలయంపై దాడులు చేయడం, నాయకులను అరెస్టు చేయడం, నిర్బంధించడం వంటి చర్యలకు కాంగ్రెస్ ప్రభుత్వం పాల్పడుతోందని విమర్శించారు. ఎన్ని నిర్బంధాలు, అరెస్టులు చేసినప్పటికీ భారతీయ జనతా పార్టీ వెనుకడుగు వేయబోదని, భవిష్యత్తులో తెలంగాణ ప్రజలకు అండగా నిలిచే పార్టీ బీజేపీయేనని, రాబోయే రోజుల్లో తెలంగాణలో అధికారంలోకి రాబోయే పార్టీ కూడా భారతీయ జనతా పార్టీయేనని రామచంద్రరావు అన్నారు. బీజేపీ నాయకులు అరెస్టులకు, నిర్బంధాలకు భయపడరని స్పష్టం చేశారు. ప్రజల కోసం పోరాడుతున్న భారతీయ జనతా పార్టీని నిర్బంధిస్తే భవిష్యత్తులో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, ప్రజలు ఇచ్చిన అధికారంతో ప్రజల సంక్షేమం కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం పనిచేయాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం వ్యక్తిగత స్వార్థాలకు పాల్పడుతూ తెలంగాణ సొమ్మును లూటీ చేస్తోందని రామచంద్రరావు ఆరోపించారు. ప్రజల సమస్యలను గాలికి వదిలేసి పక్కా రాజకీయాలతో కాంగ్రెస్ ప్రభుత్వం పబ్బం గడుపుతోందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ




ఢిల్లీలో పార్లమెంటులో ఒక విధంగా, తెలంగాణ రాష్ట్రంలో మరో విధంగా వ్యవహరిస్తూ ద్వంద్వ ప్రమాణాలను పాటిస్తోందని ఆరోపించారు. నీతి, చిత్తశుద్ధి లేని పార్టీ ఈ దేశంలో ఏదైనా ఉందంటే అది కాంగ్రెస్ పార్టీయేనని ఎన్. రామచంద్రరావు తీవ్రంగా విమర్శించారు. ఈ సందర్భంగా తుల మధుసూదన్‌రావు రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావుతో కలిసి ఇతర రాష్ట్ర నాయకులతో గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌లోనే భవిష్యత్ కార్యాచరణపై సమీక్ష నిర్వహించి, తదుపరి చేపట్టాల్సిన కార్యక్రమాలపై సంప్రదింపులు జరిపారు.

# మెడికల్ బోర్డులు వెంటనే నిర్వహించాలి

## నెలకు మూడు మెడికల్ బోర్డులు ఏర్పాటు చేసి, అనారోగ్యంతో ఉన్న కార్మికులందరినీ అన్‌ఫిట్ చేయాలి

## శ్రీరాంపూర్ ఏరియాలో నల్ల బ్యాడ్జీలతో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నిరసన



**మంచిర్యాల, 1, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** సింగరేణి సంస్థలో అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికుల కోసం ప్రతి నెల క్రమం తప్పకుండా మూడు మెడికల్ బోర్డులు నిర్వహించి, మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న అర్హులైన కార్మికులందరినీ అన్‌ఫిట్ చేయాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం డిమాండ్ చేసింది. సంఘం రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు మంగళవారం శ్రీరాంపూర్ ఏరియాలోని అన్ని గనులు, విభాగాల్లో కార్మికులు మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం సంబంధిత గని మేనేజర్లు, అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. సింగరేణి ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం, గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు పలు హామీలు ఇచ్చాయని, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నెలకు రెండు మెడికల్ బోర్డులు మాత్రమే నిర్వహించేవారని విమర్శించాయి. తాము అధికారంలోకి వస్తే నెలకు మూడు మెడికల్ బోర్డులు నిర్వహించడంతో పాటు దరఖాస్తు చేసుకున్న కార్మికులను 100 శాతం మెడికల్ అన్‌ఫిట్ చేయిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం ఆ హామీలను అమలు చేయకుండా కార్మికులను నిరాశకు గురిచేస్తున్నారని సంఘం నాయకులు ఆరోపించారు. సింగరేణి బొగ్గు గనుల్లో పనిచేయడం అంటే ప్రమాదాలతో సహవాసం చేయడమేనని, భూగర్భ గనుల్లో విషవాయువులు, పైకప్పు కూలే ప్రమాదాలు, ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుల్లో కాలుష్యం, అధిక శబ్దం తదితర కారణాలతో కార్మికుల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటోందని పేర్కొన్నారు. సింగరేణి పారిశ్రామిక ప్రాంతంలో పనిచేసే, నివసించే ప్రజల్లో వివిధ అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. కార్మికులు తమ సంపాదనలో పెద్ద మొత్తాన్ని వైద్య ఖర్చులకే వెచ్చించాల్సి వస్తోందన్నారు. చూడటానికి ఆరోగ్యంగా కనిపించే కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించినప్పుడు అనేక ఆరోగ్య సమస్యలు బయటపడుతున్నాయని, దీంతో పెద్ద సంఖ్యలో కార్మికులు మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకుంటున్నారని తెలిపారు. కానీ మెడికల్ బోర్డు ఎప్పుడు నిర్వహిస్తారోనని ఎదురు చూస్తుండగానే పలువురు కార్మికుల సర్వీసు కాలం పూర్తవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సింగరేణిలో రద్దు చేసిన డిపెండెంట్ ఉద్యోగాల స్థానంలో కారుణ్య నియామకాలు ప్రవేశపెట్టడంతో 13 వేల మందికి పైగా కార్మికులను మెడికల్ ఇన్‌వాలిడేట్ చేసినట్లు తెలిపారు. అయితే అప్పట్లో దరఖాస్తు చేసుకున్న వారిలో 70 శాతం మందినే మెడికల్ అన్‌ఫిట్ చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ సంఘాలు కార్మికుల ఎదుట విమర్శించాయని గుర్తుచేశారు. ఎన్నికల్లో తాము గెలిస్తే దరఖాస్తు చేసుకున్న కార్మికులకు 100 శాతం మెడికల్ అన్‌ఫిట్ చేయిస్తామని, ప్రతి నెల కనీసం మూడు మెడికల్ బోర్డులు నిర్వహిస్తామని హామీలు ఇచ్చారని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం ఆచరణలో 10 శాతానికి మించి మెడికల్ అన్‌ఫిట్ జరగడం లేదని ఆరోపించారు. కార్మికుల కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మెడికల్ బోర్డుల నిర్వహణలో జాప్యం చేయకుండా ప్రతి నెల మూడు బోర్డులను క్రమం తప్పకుండా నిర్వహించాలని, అనారోగ్యంతో బాధపడుతూ దరఖాస్తు చేసుకున్న అర్హులైన కార్మికులందరినీ మెడికల్ ఇన్‌వాలిడేట్ చేయాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌పీ-3 గనిలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి పెట్టం లక్ష్మణ్, కేంద్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంకట్ రెడ్డి, ఏరియా కార్యదర్శి సాదుల భాస్కర్, ఉత్తేజిరెడ్డి, ఫిట్ కార్యదర్శి తీగల వెంకటరెడ్డి, అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శి తౌటి నరేష్, ఏరియా నాయకులు తిరుపతి రెడ్డి, వినయ్ తదితరులు పాల్గొన్నారు. శ్రీరాంపూర్ ఓసీపీలో ఏరియా ఉపాధ్యక్షులు బండి రమేష్, ఫిట్ కార్యదర్శి గడ్డం సుధాకర్, అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శి జంగ రమేష్, సీనియర్ నాయకులు నీలం సదయ్య, పవన్, బుర్ర శ్రీనివాస్, సదానందం లు ఆర్కే-5 గనిలో కేంద్ర సంయుక్త కార్యదర్శి పొగాకు రమేష్, ఫిట్ కార్యదర్శి దుర్గం రవి, అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శి పాపిరెడ్డి, డివిజన్ నాయకులు గోవిందుల రమేష్, చంద్రగిరి మల్లేష్, చిప్ప రమేష్, అటికం శ్రీనివాస్, వెంకటేష్, బండారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఆర్కే-7 గనిలో ఫిట్ కార్యదర్శి రాజు నాయక్, అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శి పాదం శ్రీనివాస్, డివిజన్ నాయకులు బిరుదు శ్రీనివాస్, రవీందర్ లు , ఆర్కే న్యూటెక్ గనిలో కేంద్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.డి. లాల, ఏరియా కార్యదర్శి కుమారస్వామి, ఫిట్ కార్యదర్శి జైపాల్ రెడ్డి, అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శి రాజేంద్రప్రసాద్, ఏరియా నాయకులు దేవేందర్, నరేష్, తలారి రవి, దినకరన్, వేణు , ఎస్ఆర్‌పీ-1 గనిలో ఫిట్ కార్యదర్శి కురుమ వికాస్, అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శి తిరుపతి, ఏరియా నాయకులు తిరుపతిరావు, సముద్రాల అన్వేష్ శ్రీరాంపూర్ సీహెచ్‌పీలో ఏరియా కార్యదర్శి బుస్సా రమేష్, అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శి లక్ష్మణ్, ఏరియా నాయకులు శ్రీనివాస్ చారి, త్రివేణి, శ్రీనివాస్ , ఇందారం-1ఏ గనిలో కేంద్ర చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి అన్వేష్ రెడ్డి, ఏరియా కార్యదర్శి గొర్ల సంతోష్, ఫిట్ కార్యదర్శి గడ్డం మల్లన్న, అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శి రామారావు, రాజిరెడ్డి , ఇందారం ఓసీపీలో ఫిట్ కార్యదర్శి దర్ని దేవేందర్, సీనియర్ నాయకులు ఆకుల సతీష్, బిల్లా రాజేందర్, సాంబారు శంకర్, ఆకుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా జ్యోతి కథనానికి స్పందన

...శరవేగంగా రోడ్డు మరమ్మత్తులు

...మందమర్రి మార్కెట్ గుంతల రోడ్డుకు మోక్షం..

....వాహనదారులకు ఊరట

**మందమర్రి టౌన్ సెప్టెంబర్ 01 ప్రజా జ్యోతి:** మందమర్రి మార్కెట్ నడిబొడ్డున గుంతలమయంగా మారిన రహదారిపై ప్రజా జ్యోతిలో వెలువడిన కథనానికి అధికారులు స్పందించారు. మూడు నెలలుగా గుంతలతో వాహనదారులు పడుతున్న ఇబ్బందులను ఎత్తిచూపుతూ "ప్రమాదం జరిగితేనే మరమ్మత్తులు చేపడతారా..? మందమర్రి మార్కెట్ నడిబొడ్డున గుంతల రోడ్డు.. మూడు నెలలుగా వాహనదారుల అవస్థలు" అనే శీర్షికతో ప్రచురించిన కథనంపై అధికారులు తక్షణమే స్పందించి రోడ్డు మరమ్మత్తు పనులను చేపట్టారు. కథనం వెలువడిన వెంటనే అధికారులు కదిలి శరవేగంగా మరమ్మత్తు పనులు ప్రారంభించడంతో వాహనదారులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గుంతలను పూడ్చి రహదారిని సరిచేసే పనులు చేపట్టడంతో మార్కెట్‌కు వచ్చే ప్రజలకు కొంత ఊరట లభించింది.

....కథనం వెలువడగానే కదిలిన యంత్రాంగం


ప్రజాజ్యోతి

01 Sep 2026 - Page 1

మెటీరియల్ వచ్చి రోజులు గడుస్తున్నా

పనులు మాత్రం ఎక్కడికక్కడే!

ప్రమాదం జరిగితేనే మరమ్మత్తులు చేపడతారా..?

...మందమర్రి మార్కెట్ నడిబొడ్డున గుంతల రోడ్డు.

....మూడు నెలలుగా వాహనదారుల అవస్థలు

...ప్రజా జ్యోతి కథనంతో కదిలిన అధికారులు..

...కంకర, ఇసుక పోసి చేతులు దులుపుకున్నారా..?

గత మూడు నెలలుగా రహదారి గుంతలతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నా మరమ్మత్తులు ఆలస్యం కావడంపై ప్రజల్లో అసంతృప్తి నెలకొంది. అయితే ప్రజా సమస్యను వెలుగులోకి తీసుకువచ్చిన అనంతరం అధికారులు స్పందించి వెంటనే పనులు చేపట్టడం గమనార్హం. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో ప్రజా జ్యోతి తన బాధ్యతను మరోసారి చాటిందని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రజల సమస్యలపై అధికారులు కూడా సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు తీసుకోవడం అభినందనీయమని వారు అంటున్నారు.



....ఇకనైనా నిరంతర పర్యవేక్షణ అవసరం

మార్కెట్ ప్రాంతం నిత్యం రద్దీగా ఉండటంతో రహదారి నాణ్యతపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని స్థానికులు కోరుతున్నారు. తాత్కాలిక మరమ్మత్తులతో సమస్య మళ్లీ తలెత్తకుండా నాణ్యమైన శాశ్వత మరమ్మత్తులు చేపట్టాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజా సమస్యపై స్పందించి వెంటనే మరమ్మత్తులు చేపట్టిన అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తీసుకురావడమే ప్రజా జ్యోతి లక్ష్యమని, సమస్య పరిష్కారం అయ్యే వరకు ప్రజల పక్షాన నిలబడుతామని ప్రజా జ్యోతి ప్రతినిధి పేర్కొన్నారు.

# సెప్టెంబర్ 1వ తేదీ పెన్షన్ విద్రోహ దినం.. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి నిరసన

**సీపీఎస్‌ను తొలగించి పాత పెన్షన్ విధానం అమలు చేయాలి జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి**

**ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి**

**మంచిర్యాల, 1, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** సీపీఎస్‌ను తొలగించి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మంచిర్యాల జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1 ని పెన్షన్ విద్రోహ దినంగా పురస్కరించుకొని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక మరియు పెన్షనర్ల సంయుక్త కార్యాచరణ కమిటీ మంచిర్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నస్పూర్ ఐడీఓసీ వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్, కార్యదర్శి జనరల్ ఏలూరి శ్రీనివాసరావు, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి, జిల్లా కార్యదర్శి జనరల్ శ్రీమతి వనజారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. జిల్లాలోని అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాల ప్రతినిధులు, కార్యాలయ సబార్డినేట్ నుంచి జిల్లా స్థాయి అధికారి వరకు ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముందుగా నస్పూర్ ఐడీఓసీ ముఖద్వారం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని తొలగించి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఐఏఎస్కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక మరియు పెన్షనర్ల సంయుక్త కార్యాచరణ కమిటీ మంచిర్యాల జిల్లా చైర్మన్ గడియారం శ్రీహరి మాట్లాడుతూ.. 2004 సెప్టెంబర్ 1 నుంచి నియామకమైన ఉద్యోగులు, ఉపాధ్యాయుల పాలిట కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం శాపంగా మారిందన్నారు. ఈ విధానం కారణంగా ఉద్యోగ, ఉపాధ్యాయుల కుటుంబాలు రోడ్డున పడి చిన్నాభిన్నమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని, ఈ విధానంలో ఉన్న ఉద్యోగుల భవిష్యత్తు అంధకారంలో పడుతోందని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని తొలగించి పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అన్ని సంఘాలు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పెన్షన్ విద్రోహ దినం మహాధర్నాలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల సమస్యలపై చర్చించి ప్రధాన డిమాండ్లను అందరి ఆమోదంతో ఏకగ్రీవంగా ఆమోదించారు. రెండో వేతన సవరణ సంఘాన్ని 51 శాతం ఫిట్‌మెంట్‌తో తక్షణమే అమలు చేయాలని, ఉద్యోగులకు పెండింగ్ లో ఉన్న ఆరు విడతల కరువు భత్యాన్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన నూతన ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని సమర్థవంతంగా, తక్షణమే అమలు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న రూ.12 వేల కోట్ల అన్ని బిల్లులను ఒకేసారి చెల్లించాలని, లేదా ప్రతి నెల రూ.2 వేల కోట్ల చొప్పున ఆరు నెలల్లోగా విడుదల చేసి ఉద్యోగుల బకాయిలను త్వరితగతిన చెల్లించాలని డిమాండ్ చేశారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ అయిన సందర్భంగా ఉద్యోగులకు 17 శాతం ఇంటి అద్దె భత్యం ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగుల ఆర్థిక, సామాజిక, సేవా ప్రయోజనాలకు సంబంధించిన న్యాయమైన డిమాండ్లపై తెలంగాణ ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉద్యోగ సంఘాలను చర్చలకు పిలవాలని, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని గడియారం శ్రీహరి కోరారు. టీజీఈజేఏసీ మంచిర్యాల జిల్లా కార్యదర్శి జనరల్ శ్రీమతి వనజారెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని తొలగించి వెంటనే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్ల న్యాయమైన




డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించని పక్షంలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటించి ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ పెన్షన్ విద్రోహ దినం మహాధర్నాలో అదనపు కార్యదర్శి జనరల్ కె. శంకర్, సహ అధ్యక్షులు జి. చక్రపాణి, శ్రీనివాస్ దేశ్‌పాండే, పొన్న మల్లయ్య, శ్రీపతి బాపురావు, భూముల రామ్మోహన్, బట్టారి వెంకటేశ్వర్లు, గుండేటి నాందేవ్, సుమిత్, పోడేటి సంజీవ్, పోలాస సత్యనారాయణ, ధరణికోట వేణుగోపాల్, పత్తి సత్తయ్య, బి. ప్రభాకర్, దుర్గ ప్రసాద్, బి. రామ్‌మోహన్, కె.వి.ఎల్.ఎన్. మూర్తి, రాజేశ్వర్, ఎం.డి. అజర్, రాసపల్లి రవి, జి. రాజగోపాల్, ఉప కార్యదర్శి జనరల్స్ బొడ్డు శ్రావణ్‌కుమార్, ఏ. సుధాకర్, ఉపాధ్యక్షులు బి. మోహన్, జి. రాజవేణు, ఆళ్ల రాజేందర్‌రెడ్డి (తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ సంఘం), పి. నరేందర్, ఓ. కృష్ణ, బి. మనోజ్, మోతె జయకృష్ణ, సూరినేని గంగాధర్, బన్న రవీందర్, ఎస్. కిషన్, బాలకృష్ణ, ఎ. సునీత, ఎన్. గోపాల్, బెజ్జంకి జగన్, మోషిన్ అహ్మద్, వెంకటరమణ, ఎం. రమేష్, రాథోడ్ రమేష్, ఆర్థిక కార్యదర్శి అనుముల సతీష్‌కుమార్, ప్రచార కార్యదర్శి జె. రామ్‌కుమార్, కార్యదర్శులు నడిమెట్ల సత్యనారాయణ, తిరుపతి, మేడి శంకర్, జి. వెంకటేశం, జి. వెంకటస్వామి, కే. శ్రీధర్ స్వామితో పాటు టీజీవో, టీఎన్జీవో నాయకులు, వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల, కార్మిక సంఘాల ప్రతినిధులు, నాయకులు, జిల్లాలోని అన్ని శాఖల ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు అరెస్టును ఖండించిన బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్

**మంచిర్యాల, 1, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** నల్లగొండ జిల్లా పర్యటనకు వెళ్తున్న భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావును మంగళవారం ఉదయం అరెస్టు చేయడాన్ని బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. నల్లగొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి ఇంటిపై దాడి చేసి, ఆయన తల్లిని భయభ్రాంతులకు గురిచేసిన కాంగ్రెస్ పార్టీ నాయకుల చర్యలను ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. ఇలాంటి చర్యలను భారతీయ జనతా పార్టీ పిరికిపంద చర్యలుగా భావిస్తోంద న్నారు. అదేవిధంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంపై నల్ల రంగు వేయడం, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను దగ్ధం చేసేందుకు ప్రయత్నించడం వంటి ఘటనలను కూడా కాంగ్రెస్ పార్టీ నాయకుల పిరికిపంద చర్యలుగా ఆయన అభివర్ణించారు. ప్రజాస్వామ్య భారతదేశంలో ప్రతిపక్ష పార్టీల కార్యాలయాలపై దాడులను ప్రోత్సహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ హెచ్చరించారు. ప్రజా స్వామ్యంలో ప్రతిపక్షపార్టీలకు కూడా స్వేచ్ఛగా తమ కార్యకలాపాలు నిర్వహిం చే హక్కు ఉందని, ఆ హక్కులను కాలరా సే విధంగా వ్యవహరించడం సరికాదని అన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న 22 రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై, కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలపై ఇదే విధంగా దాడులు చేస్తే దేశంలో కాంగ్రెస్ పార్టీ మనుగడ సాగిస్తుందా? అని కాంగ్రెస్ పార్టీ నాయకులను ఆయన ప్రశ్నించారు. ఇతర పార్టీ లపై దాడులను ప్రోత్సహించే ముందు భవిష్యత్తులో అదే పరిస్థితి తమ పార్టీకి ఎదురైతే ఎలా ఉంటుందో ఒక్కసారి ఆలోచించుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులను హెచ్చరించారు.



# శిక్షణ పూర్తి చేసిన ట్రైనీలు ఐటీఐలో పొందిన సాంకేతిక నైపుణ్యాలను సద్వినియోగం చేసుకోవాలి మంచి ఉద్యోగ అవకాశాలను సాధించాలి

## ప్రభుత్వ ఐటీఐ మంచిర్యాలలో ఘనంగా కాన్వొకేషన్, ఫ్రెషర్స్ పార్టీ





**మంచిర్యాల, 1, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** ప్రభుత్వ ఐటీఐ మంచిర్యాలలో ట్రైనీల విద్య, సాంకేతిక నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం, ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి, భవిష్యత్ ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించేలా మంగళవారం కాన్వొకేషన్, ఫ్రెషర్స్ పార్టీ, నార్కోటిక్స్ అవగాహన కార్యక్రమం, ట్రేడ్ వారీగా కెరీర్ అవగాహన కార్యక్రమం, తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసిన ట్రైనీలను అభినందిస్తూ ఐటీఐలో పొందిన సాంకేతిక నైపుణ్యాలను సద్వినియోగం చేసుకొని మంచి ఉద్యోగ అవకాశాలను సాధించాలని సూచించారు. ప్రస్తుత పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను మరింత పెంపొందించుకొని భవిష్యత్తులో మంచి కెరీర్‌ను నిర్మించుకోవాలని తెలిపారు. అనంతరం నూతనంగా ఐటీఐలో చేరిన ట్రైనీల కోసం ఫ్రెషర్స్ పార్టీ నిర్వహించగా ట్రైనీలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ట్రైనీలలో ఆత్మవిశ్వాసం, స్నేహభావం, నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించే విధంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విచ్చేసిన డాక్టర్ నరేందర్ రాథోడ్ (ప్రోగ్రామ్ ఆఫీసర్), డాక్టర్ సునీల్ (సైకియాట్రిస్ట్), బుక్క వెంకటేశ్వర్లు (మాస్ మీడియా ఆఫీసర్) ట్రైనీలకు ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన కల్పించారు. ట్రైనీలు, యువతను లక్ష్యంగా చేసుకొని నార్కోటిక్స్ అవగాహన కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్యంపై వాటి ప్రభావం, కుటుంబ, సామాజిక జీవితంపై పడే దుష్ప్రభావాలను వివరించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధిపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ట్రేడ్ వారీగా కెరీర్, ఉద్యోగ అవకాశాలపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఆయా ట్రేడ్లకు చెందిన ట్రేడ్ ఇన్‌స్ట్రక్టర్లు తమ ట్రేడ్ల ప్రాధాన్యత, పరిధి, ప్రస్తుత పరిశ్రమల్లో ఉన్న డిమాండ్, ఉద్యోగ అవకాశాలు, భవిష్యత్తులో అందుబాటులోకి వచ్చే ఉపాధి అవకాశాల గురించి ట్రైనీలకు వివరించారు. తమకు ఆసక్తి ఉన్న ట్రేడ్‌లో పూర్తి స్థాయిలో నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవడం ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, పరిశ్రమలు, ఇతర రంగాల్లో మంచి ఉద్యోగ అవకాశాలను పొందవచ్చని తెలిపారు. ప్రస్తుత కాలంలో సాంకేతిక నైపుణ్యాలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని శిక్షణ సమయంలోనే ప్రాక్టికల్ నాలెడ్జ్‌తో పాటు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. భవిష్యత్తులో లభించే ఉద్యోగ అవకాశాలు, ఉద్యోగం పొందేందుకు అవసరమైన నైపుణ్యాలు, ఉన్నత స్థాయికి ఎదగడానికి అనుసరించాల్సిన మార్గాలు, కెరీర్‌లో ఎలా స్థిరపడాలి అనే అంశాలపై ట్రైనీలకు మార్గదర్శకత్వం అందించారు. ఐటీఐ శిక్షణను కేవలం ఒక కోర్సుగా కాకుండా భవిష్యత్ ఉపాధికి బలమైన పునాదిగా ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఆఫీసర్ ఎన్. సునీల్, ట్రైనింగ్ ఆఫీసర్ ముస్తఫా, ట్రైనింగ్ ఆఫీసర్ కె. ప్రకాశ్‌రావుతో పాటు వివిధ ట్రేడ్లకు చెందిన ట్రేడ్ ఇన్‌స్ట్రక్టర్లు, ఐటీఐ సిబ్బంది పాల్గొని ట్రైనీలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులతో సమావేశంను కూడా నిర్వహించారు. ఈ సమావేశంలో ట్రైనీల హాజరు, శిక్షణలో వారి పురోగతి, క్రమశిక్షణ, ప్రాక్టికల్ నైపుణ్యాలు, భవిష్యత్ ఉద్యోగ అవకాశాలపై తల్లిదండ్రులతో చర్చించారు. ట్రైనీల భవిష్యత్ అభివృద్ధిలో తల్లిదండ్రులు, ఐటీఐ సిబ్బంది సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఐటీఐ మంచిర్యాల ప్రిన్సిపాల్ పి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ట్రైనీలకు సాంకేతిక విద్యతో పాటు ఆరోగ్యం, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత, మాదకద్రవ్యాలపై అవగాహన, భవిష్యత్ కెరీర్‌పై స్పష్టమైన దిశానిర్దేశం కల్పించడం ఎంతో ముఖ్యమని తెలిపారు. ప్రతి ట్రైనీ తనకు నచ్చిన ట్రేడ్‌లో నైపుణ్యాన్ని పెంపొందించుకొని మంచి ఉద్యోగాన్ని సాధించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ట్రైనీల సమగ్ర అభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి, మెరుగైన ఉపాధి అవకాశాల కోసం ప్రభుత్వ ఐటీఐ మంచిర్యాల ఆధ్వర్యంలో నిరంతరం వివిధ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ట్రైనింగ్ అధికారులు, ట్రేడ్ ఇన్‌స్ట్రక్టర్లు, ఇతర ఐటీఐ సిబ్బంది, ట్రైనీలు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు.

# థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరాలో కొరత ఉండొద్దు

**సింగరేణితో ఇంధన ఒప్పందం ఉన్న కేంద్రాలకు తగినంత బొగ్గు అందించాలి**

**కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి ఆదేశం**

**28 థర్మల్ కేంద్రాల్లో తక్కువగా ఉన్న బొగ్గు నిల్వలపై ప్రత్యేక సమీక్ష**




**మంచిర్యాల, 1, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** దేశంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరాలో ఎలాంటి అంతరాయం, కొరత లేకుండా చర్యలు చేపట్టాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి ప్రభుత్వ రంగ బొగ్గు ఉత్పత్తి సంస్థలను ఆదేశించారు. ముఖ్యంగా సింగరేణి సంస్థతో ఇంధన సరఫరా ఒప్పందం ఉన్న థర్మల్ విద్యుత్ కేంద్రాలకు ఎప్పటిలాగే తగినంత బొగ్గును సజావుగా సరఫరా చేయాలని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ బొగ్గు ఉత్పత్తి సంస్థలతో థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరాపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా దేశంలోని 28 థర్మల్ విద్యుత్ కేంద్రాల వద్ద బొగ్గు నిల్వలు తక్కువగా ఉన్నట్లు మంత్రి వెల్లడించారు. ఆయా థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరా చేస్తున్న ప్రభుత్వ సంస్థలు తక్షణమే స్పందించి, ఎలాంటి బొగ్గు కొరత ఏర్పడకుండా బొగ్గు రవాణాను పెంచాలని ఆదేశించారు. దేశవ్యాప్తంగా విద్యుత్ అవసరాలు పెరుగుతున్న పరిస్థితుల్లో థర్మల్ విద్యుత్ కేంద్రాల నిరంతర విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన బొగ్గును సకాలంలో అందించడం అత్యంత కీలకమని కిషన్‌రెడ్డి అన్నారు. ఇంధన సరఫరా ఒప్పందాలు ఉన్న విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరాలో ప్రాధాన్యతనిస్తూ, నిల్వలు తగ్గకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో కోల్ ఇండియాతో పాటు సింగరేణి సంస్థ, ఇతర ప్రభుత్వ రంగ బొగ్గు ఉత్పత్తి సంస్థల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సింగరేణి సంస్థ ఛైర్మన్, ఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి మాట్లాడుతూ, సింగరేణి సంస్థతో ఇంధన సరఫరా ఒప్పందం ఉన్న థర్మల్ విద్యుత్ కేంద్రాలకు తగినంత బొగ్గును ఇప్పటికే సరఫరా చేస్తున్నామని తెలిపారు. పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇకపై కూడా థర్మల్ విద్యుత్ కేంద్రాలకు అవసరమైన మేరకు బొగ్గును అందించేందుకు సంస్థ అన్ని విధాలా కృషి చేస్తుందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ నుంచి నిర్వహించిన ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సంస్థ ఛైర్మన్, ఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతితో పాటు డైరెక్టర్ (పర్సనల్ అండ్ ఫైనాన్స్) గౌతమ్ పోట్రు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూవ్‌మెంట్) బి. వెంకన్న, జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్ అండ్ మార్కెటింగ్) తాడబోయిన శ్రీనివాస్ పాల్గొన్నారు. కొత్తగూడెం హెడ్ ఆఫీస్ నుంచి సంస్థ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణ, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కె. వెంకటేశ్వర్లు, డైరెక్టర్ (ఈ అండ్ ఎం) ఎం. తిరుమలరావు పాల్గొన్నారు.

## పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



**తాళ్లపేట, సెప్టెంబర్ 1(ప్రజాజ్యోతి):**కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానానికి (సి.పి.ఎస్) వ్యతిరేకంగా, పాత పెన్షన్ విధానాన్ని (ఓ.పి.ఎస్) పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ తాళ్లపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులందరూ మంగళ వారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఉద్యోగుల భవిష్యత్ ఆర్థిక భద్రతకు పెన్షన్ ఎంతో కీలకమని, కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం వల్ల ఉద్యోగ విరమణ అనంతరం ఎదురయ్యే ఆర్థిక అనిశ్చితిపై ఆందోళన వ్యక్తంచేశారు. ఉద్యోగుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ విధానాన్ని వెంటనే రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు.మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయు లంతా ఏకతాటిపై నిలిచి తమ నిరసనను శాంతియుతంగా వ్యక్తం చేశారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి తక్షణమే తగిన నిర్ణయం తీసుకో వాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో తాళ్లపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదివాసి కోయ సంఘం జిల్లా జాయింట్ సెక్రెటరీగా ఆర్కా రాజారాం

**చెన్నూరు, సెప్టెంబర్ 1: ప్రజా జ్యోతి** ఆదివాసి కోయ సంఘం జిల్లా కమిటీని చెన్నూరు పట్టణంలోని మైనార్టీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఎన్నుకు న్నారు. సంఘం నాయకులు, ప్రతినిధుల సమక్షంలో నూతన జిల్లా కమిటీని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా నస్పూర్ మండలం అరుణక్‌నగర్‌కు చెందిన ఆర్కా రాజారాంను ఆదివాసి కోయ సంఘం మంచిర్యాల జిల్లా జాయింట్ సెక్రెటరీగా నియమించారు.



తనపై నమ్మకంతో జిల్లా కమిటీలో కీలక బాధ్యతలు అప్పగించినందుకు రాజారాం సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.తనకు ఈ బాధ్యతను అప్పగించిన గౌరవ అధ్యక్షుడు నైతం లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు చెదంక మాంతయ్య, ప్రధాన కార్యదర్శి మడ సమ్మయ్యలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఆదివాసి కోయ సంఘం బలోపేతానికి, ఆదివాసీల హక్కులు, సంక్షేమం కోసం తనవంతు కృషి చేస్తానని రాజారాం పేర్కొన్నారు.నూతన బాధ్యతకు ఎంపికైన ఆర్కా రాజారాంను సంఘం నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

## రాహుల్‌గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ ఆందోళన

**బీజేపీ వైఖరిని ఖండిస్తూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం**



**జైపూర్, సెప్టెంబర్ 1: ప్రజా జ్యోతి** ఇటీవల ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ పార్టీ అగ్రనేతల కార్యక్రమానికి సంబంధించిన ఘటనలో లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని నిరసిస్తూ జైపూర్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీపై నమోదు చేసిన కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నాయకుడికి ప్రశ్నించే హక్కు ఉంటుందని, రాజకీయ కక్షతో కేసులు నమోదు చేయడం సరికాదని అన్నారు.అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ నాయకులు, జైపూర్ మండల కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శిరీష హత్య నిందితులను కఠినంగా శిక్షించాలి

**కుమురంభీం చౌరస్తాలో ప్రజా సంఘాల నిరసన**



**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 1 ప్రజా జ్యోతి** ఆదివాసీ గిరిజన ఆడబిడ్డ ఊకే శిరీషపై అత్యాచారం చేసి హత్యకు పాల్పడిన నిందితులను తక్షణమే అరెస్టు చేసి, ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపి కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని కోరుతూ మంగళవారం జిల్లా కేంద్రంలోని కుమురంభీం చౌరస్తాలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి గోడిసెల కార్తీక్, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నేర్పల్లి అశోక్, ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి నంది పద్మ మాట్లాడుతూ మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు పెరుగుతు న్నా ప్రభుత్వాలు అడ్డుకట్ట వేయడంలో విఫలమవుతున్నాయని విమర్శించారు. శిరీషపై జరిగిన దారుణ ఘటనపై ప్రభుత్వం తక్షణమే స్పందించి నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.శిరీష కుటుంబానికి తక్షణ ఆర్థిక సాయం అందించడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్, సహాయ కార్యదర్శి శ్రీకాంత్, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కోట శ్రీనివాస్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దుర్గం రాజ్‌కుమార్, కోశాధికారి నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగులకు క్యాడర్ స్కీమ్ ప్రమోషన్లు.



**మందమర్రి, సెప్టెంబర్ 01( ప్రజాజ్యోతి ):** సింగరేణి మందమర్రి ఏరియాలో పలువురు ఉద్యోగులకు క్యాడర్ స్కీమ్ ద్వారా పదోన్నతులు లభించాయి.మంగళవారం జీఎం కార్యాలయంలో జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ ప్రమోషన్ ఆర్డర్లను ఉద్యోగులకు అందజేసి అభినందించారు.ఉద్యోగులు క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని జీఎం సూచించారు. పదోన్నతులు పొందిన ఉద్యోగులకు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత అవకాశాలు రావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో డీజీఎం (పర్సనల్) సిహెచ్. అశోక్, ఏజీఎం (ఎఫ్అండ్ఏ) ఆర్.వి.ఎస్. ఆర్.కె. ప్రసాద్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు**



**మంచిర్యాల, 1, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** భూ వివాదాల పరిష్కారంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు అధికారులను ఆదేశించారు. జిల్లాలోని భీమిని మండల తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా అదనపు కలెక్టర్ మంగళవారం సందర్శించారు. మండలంలో కొనసాగుతున్న రీ-సర్వే ప్రక్రియపై మండల తహసీల్దార్, సర్వేయర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని తంగళ్ళపల్లి గ్రామంలో కొనసాగుతున్న రీ-సర్వే పనులను వేగవంతం చేయాలని సూచించారు. సర్వే చేసిన విస్తీర్ణానికి సంబంధించి కో-రిలేషన్ స్టేట్‌మెంట్‌ను పూర్తి చేయాలని, రీ-సర్వే పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా ఎలాంటి జాప్యం లేకుండా సర్వే ప్రక్రియను పూర్తి చేసేలా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దుబ్బగూడానికి కొత్త చిరునామా.

**ఆర్అండ్ఆర్ కాలనీలో తొలి గృహప్రవేశం.**

**మందమర్రి, సెప్టెంబర్ 01 (ప్రజా జ్యోతి ):** కేకే ఓసీపీ ముంపు ప్రాంతమైన



దుబ్బగూ దం వాసుల పునరా వాసం కోసం సింగరే ణి ఏర్పాటు చేసిన ఆర్అండ్ఆర్ కాలనీలో అభివృద్ధి పనులు కొనసాగుతు న్నాయి.కాలనీలో ఇప్పటికే తొలి నూతన గృహప్రవేశం జరిగినట్లు మందమర్రి ఏరియా జీఎం ఎన్.రాధాకృష్ణ తెలిపారు. నిర్వాసితులకు సింగరేణి యాజమాన్యం రెండు గుంటల చొప్పున స్థలాలు కేటాయించిందన్నారు.త్వరలోనే కొత్త కాలనీ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుందని తెలిపారు.

# సింగరేణిలో సివిల్ డిపార్ట్‌మెంట్ అధికారుల బదిలీలు

**మంచిర్యాల, 1, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌లో సివిల్ విభాగానికి చెందిన ఆరుగురు అధికారులను బదిలీ చేస్తూ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. క్రాప్/పీఈఆర్/సి/26/2274 నంబర్‌తో సెప్టెంబర్ 1, 2026న ఎగ్జిక్యూటివ్ ఎస్టాబ్లిష్‌మెంట్ సెల్ ఈ ఆఫీస్ ఆర్డర్‌ను జారీ చేసింది. బదిలీలు తక్షణమే అమల్లోకి వస్తాయని ఉత్తర్వుల్లో తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియా సివిల్ విభాగంలో అదనపు జనరల్ మేనేజర్ (సివిల్)గా పనిచేస్తున్న కె. ఆనంద్ కుమార్‌ను క్యూసీసీ (సివిల్), బీపీఏ రీజియన్, ఎస్టీపీపీ--ఎస్ఆర్‌పీ ఏరియాలకు బదిలీ చేసి పోస్టింగ్ ఇచ్చారు. ఆయనను కార్పొరేట్ కార్యాలయంలోని జనరల్ మేనేజర్ (సివిల్)కు రిపోర్టు చేయాలని ఆదేశించారు. అలాగే క్యూసీసీ (సివిల్), ఆర్జీ రీజియన్ బాధ్యతలను కూడా తన సాధారణ విధులతో పాటు ఆయన అదనంగా పర్యవేక్షించనున్నారు. ఆర్జీ--3 ఏరియాలో సివిల్ విభాగంలో డిప్యూటీ జనరల్ మేనేజర్ (సివిల్)గా పనిచేస్తున్న బి. రాజేంద్ర కుమార్‌ను కేజీఎం, ఎస్టీపీఎల్ ఏరియాల సివిల్ విభాగానికి బదిలీ చేశారు. ఆయన కేజీఎం జనరల్ మేనేజర్‌కు రిపోర్టు చేయాలి. వైఎల్‌డీ ఏరియాలో డిప్యూటీ జనరల్ మేనేజర్ (సివిల్)గా పనిచేస్తున్న సల్లం రవికుమార్‌ను ఆర్జీ--3, ఏపీఏ ఏరియాల సివిల్ విభాగానికి బదిలీ చేశారు. ఆయన ఆర్జీ--3 జనరల్ మేనేజర్‌కు రిపోర్టు చేయాల్సి ఉంటుంది. ఎస్టీపీఎల్ ఏరియాలో సివిల్ విభాగంలో సూపరింటెండింగ్ ఇంజనీర్ (సివిల్) గా పనిచేస్తున్న అలుగొండ రవికుమార్‌ను శ్రీరాంపూర్ ఏరియా సివిల్ విభాగానికి బదిలీ చేశారు. ఆయన శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్‌కు రిపోర్టు చేయాలి. ఆర్జీ--2 ఏరియాలో డిప్యూటీ సూపరింటెండింగ్ ఇంజనీర్ (సివిల్)గా పనిచేస్తున్న ఎం. వినయ్ సాగర్‌ను వైఎల్‌డీ ఏరియా సివిల్ విభాగానికి బదిలీ చేశారు. ఆయన వైఎల్‌డీ ఏరియా జనరల్ మేనేజర్‌కు రిపోర్టు చేయాలి. కార్పొరేట్ కార్యాలయంలో సివిల్ విభాగంలో మేనేజ్‌మెంట్ ట్రైనీగా పనిచేస్తున్న మండల అభిషేక్‌ను ఆర్జీ--2 ఏరియా సివిల్ విభాగానికి బదిలీ చేశారు. ఆయన ఆర్జీ--2 ఏరియా జనరల్ మేనేజర్‌కు రిపోర్టు చేయాల్సి ఉంటుంది. ఈ బదిలీల కారణంగా అధికారుల వేతనం, గ్రేడ్‌లో ఎలాంటి మార్పు ఉండదని యాజమాన్యం స్పష్టం చేసింది. బదిలీ అయిన అధికారులు తమ ప్రస్తుత పని ప్రదేశాల నుంచి సెప్టెంబర్ 5, 2026లోగా రిలీవ్ అయి, కొత్తగా కేటాయించిన విధుల్లో చేరాలని ఆదేశించింది. అధికారులను రిలీవ్ చేసే బాధ్యతను జనరల్ మేనేజర్ (సివిల్), కార్పొరేట్ కార్యాలయం చూసుకోవాలని తెలిపారు. సమర్థ అధికారుల అనుమతితో ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు జనరల్ మేనేజర్ (పర్సనల్), ఈఈ అండ్ ఆర్‌సీ ఆర్డర్‌లో తెలిపారు.

# రాహుల్‌పై కేసులతో.. కాంగ్రెస్ రణగర్జన!

ప్రశ్నిస్తే కేసులు పెడతారా? బీజేపీ కక్షసాధింపును సహించం

'శుద్ధీకరణ' ఘటనపై ప్రశ్నించినందుకే ఎఫ్ఐఆర్‌నా?

కేసులు ఉపసంహరించకుంటే ప్రజా ఉద్యమం ఉధృతం: డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 1 ప్రజా జ్యోతి** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై ఉత్తరాఖండ్‌లో నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌పై కాంగ్రెస్ శ్రేణులు భగ్గుమన్నాయి. రాజకీయ కక్షసాధింపులో భాగంగానే రాహుల్‌పై కేసు నమోదు చేశారని ఆరోపిస్తూ ఆసిఫాబాద్‌లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ నిరసన చేపట్టారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన ఆందోళనలో బీజేపీ ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 'ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా కేసులతో గొంతు నొక్కుతారా?' అంటూ కాంగ్రెస్ నేతలు నిలదీశారు. దళితులు, బహుజనుల హక్కులు, సామాజిక న్యాయం కోసం రాహుల్ గాంధీ పోరాడుతున్నారని, అలాంటి నాయకుడిపై కుట్రపూరితంగా కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ ఆరోపించారు. ఉత్తరాఖండ్‌లో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొన్న సభ అనంతరం 'శుద్ధీకరణ' పేరుతో పూజలు నిర్వహించిన ఘటనను రాహుల్ గాంధీ ప్రశ్నించారని, సామాజిక వివక్ష, అంటరానితనం వంటి అంశాలను ప్రశ్నించడం నేరం కాదని ఆమె అన్నారు. ఈ అంశంపై ప్రశ్నించినందుకే ఎఫ్ఐఆర్ నమోదు చేయడం బీజేపీ కక్షసాధింపు రాజకీయాలకు పరాకాష్ట అని విమర్శించారు. 'కేసులతో ప్రతిపక్ష గొంతును అణచలేరు' అని సుగుణ స్పష్టం చేశారు. రాహుల్‌పై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. నిరసనలో ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి అజ్మీరా శ్యామ్‌నాయక్‌తో పాటు మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల మంగ, మైనార్టీ సెల్ జిల్లా



అధ్యక్షుడు హర్షద్, పంచాయితీరాజ్ సంఘటన్ జిల్లా కోఆర్డినేటర్ కోవా ఇందిరా, డీసీసీ కార్యవర్గ సభ్యులు, మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళా కాంగ్రెస్ సభ్యులు, ఇందిరా ఫెలోషిప్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## గూడెం గోదావరి వద్ద రూ.12 కోట్లతో పుష్కర ఘాట్లు:

- భూమిపూజ చేసిన ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు
- హాజరైన మాజీ డిసిసి అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ
- మంచిర్యాల డీసీపీ భాస్కర్

**దండేపల్లి సెప్టెంబర్ 1(ప్రజాజ్యోతి ):** మండలం గూడెం గోదావరి తీరంలో రాబోయే 'తెలంగాణ కుంభమేళా' గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సమాయత్తమవుతోంది. ఇందులో భాగంగా సుమారు రూ.12 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఆధునిక పుష్కర ఘాట్ల నిర్మాణ పనులకు మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు మంగళవారం ఘనంగా భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ తెలంగాణ కుంభమేళాగా భావించే గోదావరి పుష్కరాల సమయంలో గూడెం పుష్కర ఘాట్‌కు దాదాపు 15 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నామన్నారు. పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా స్నానఘట్టాలు, తాగునీరు, తాత్కాలిక వసతి, విద్యుత్ వెలుగులు, రవాణా మరియు పారిశుధ్య వసతులను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకు వస్తామని తెలిపారు.

**అధికారులకు కఠిన ఆదేశాలు:** పనుల నాణ్యతలో ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా, నిర్దేశిత గడువులోగా నిర్మాణాలను పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లను, అధికారులను ఆదేశించారు.

**పర్యాటకంగా పురోగతి:** ఈ ఘాట్ల నిర్మాణంతో పాటు గూడెం గుట్ట సత్యనారాయణ స్వామి ఆలయం అభివృద్ధితో ఈ ప్రాంత రూపరేఖలు మారనున్నాయని, భవిష్యత్తులో ఈ ప్రాంతం ప్రముఖ పుణ్యక్షేత్రంగానే కాకుండా ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు. ఈ భూమిపూజ కార్యక్రమం లో మంచిర్యాల డిసిపి భాస్కర్, మాజీ డిసిసి అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, గూడెం సత్యనారాయణ స్వామి ఆలయ ఈఓ శ్రీనివాస్, మంచిర్యాల జిల్లా ఆర్టిఏ మెంబర్ అంకతి శ్రీనివాస్, లక్సెట్టిపేట్ మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల వెంకటేశ్వర్లు, సింగిల్ విండో చైర్మన్ నాగభూషణం, ముత్యాల



శ్రీనివాస్, మంచిర్యాల జిల్లా ఆర్జీపిఆర్ఎస్ గడ్డం త్రిమూర్తి, లక్సెట్టిపేట్ పట్టణ అధ్యక్షులు సయ్యద్ షాహిద్ అలీ, లక్సెట్టిపేట్ మండల అధ్యక్షులు నలిమెల రాజు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కార్పొరేటర్ తూముల నరేష్, జిల్లా నాయకులు పూర్ణచంద్రరావు,కౌన్సిలర్లు, సర్పంచ్లు, ఉప సర్పంచ్లు, వార్డు మెంబర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, సింగిల్ విండో డైరెక్టర్లు, నాయకులు, మహిళా నాయకురాలు, యువ జన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గూడెం గుట్టపై వైభవంగా పవిత్రోత్సవాలు ప్రారంభం



**దండేపల్లి (మంచిర్యాల):** దండేపల్లి మండలం గూడెం గుట్టపై వెలసియున్న శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానంలో పవిత్రోత్స వాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రతి ఏటా నిర్వహించే ఈ వేడుకలు ఈ సంవత్సరం కూడా మూడు రోజుల పాటు ఘనంగా జరగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు అఖండ దీపారాధన, విశ్వక్సేనారాధన, వాసుదేవపుణ్యాహవ చనం, రుత్విక్ వరణం, మృత్సంగ్రహణం, అంకురార్పణ, ధ్వజారోహణం, అగ్ని ప్రతిష్ఠ, స్థాపితదేవతాహవ నములు, పవిత్ర ఆదివాసం, నిత్య పూర్ణాహుతి, హారతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమాలు యజ్ఞాచార్యులు అభిరామాచార్యులు ఆధ్వర్యంలో, ముఖ్య అర్చకులు గోవర్ధన రఘు స్వామి, వేద పండితులు నారాయణ శర్మ, భరత్ శర్మ, అర్చకులు జి. సంపత్ స్వామి, జి. సురేష్ స్వామిల చేతుల మీదుగా వేదమంత్రోచ్చారణల మధ్య ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ బి. శ్రీనివాస్, అర్చకులు, దేవస్థాన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వాట్సాప్ గ్రూప్ అడ్మిన్లు అప్రమత్తంగా ఉండాలి. రెచ్చగొట్టే పోస్టు పెడితే అడ్మిన్ లేదే బాధ్యత



**జన్నారం, సెప్టెంబర్1 (ప్రజాజ్యోతి)** వాట్సాప్ గ్రూప్ లలో మత విద్వేషాలను, ప్రజల మధ్య చిచ్చు పెట్టే విధంగా ఫేక్ న్యూస్, అసభ్యకర పోస్టులు పెడితే ఆ పోస్ట్ పెట్టిన వ్యక్తితో పాటు గ్రూప్ అడ్మిన్ కూడా బాధ్యుడవుతాడని ఎస్సై ఉదయ్కిరణ్ హెచ్చరించారు. మంగళవారం రోజున మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో వాట్సాప్ గ్రూప్ అడ్మిన్ లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.ఐ ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ వాట్సాప్ గ్రూప్ అడ్మిన్ అంటే కేవలం సభ్యులను యాడ్ చేయడమే అనుకుంటున్నారని కానీ చట్ట ప్రకారం అడ్మిన్ కు కూడా బాధ్యత ఉంటుందని, గ్రూపులో ఎవరైనా రెచ్చగొట్టే పోస్ట్ లు పెడితే వెంటనే గ్రూప్ అడ్మిన్ ఆ పోస్టును ఖండించి సంబంధిత వ్యక్తిని గ్రూప్ నుండి తొలగించి పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కావున ఒక గ్రూప్ కు ఒకే అడ్మిన్ ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ఫార్వర్డ్ మాత్రమే చేశాను అని భావించకుండా, ఏదైనా కంటెంట్ ను షేర్ చేసే ముందు అది నిజమా, అవసరమా ఇతరులకు ఇబ్బంది కలిగిస్తుందా అని ఆలోచించాలని, ఇతరుల వ్యక్తిగత గౌరవం, ప్రతిష్ట మరియు మనోభావాలను దెబ్బతీసే ఫోటోలు వీడియోలు కామెంట్లు లేదా పోస్టులు చేయవద్దని అన్నారు. ఒక వాట్సాప్ లో మాత్రమే కాకుండా ఇన్స్టాగ్రామ్, ఫేస్ బుక్, టెలిగ్రామ్ తదితర సోషల్ మీడియా వేదికలలో కూడా అసభ్యకర, రెచ్చగొట్టే పోస్టులను పెట్టవద్దని హెచ్చరించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలు వాట్సప్ గ్రూప్ ల అడ్మిన్లు పాల్గొన్నారు

## అవార్డుల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, 1, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** జిల్లాలో జాతీయ రహదారి 63 నిర్మాణం, విస్తరణకు సంబంధించి అవార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మంచిర్యాల రాజస్వ మండల అధికారి కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. డి.ఎ.ఓ. రమేష్తో కలిసి జాతీయ రహదారి విస్తరణకు సంబంధించి అందిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన జాతీయ రహదారి 63 విస్తరణకు సంబంధించి అవార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి, పరిష్కరించే విధంగా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

## రైతులకు ఉచిత మొక్కల పంపిణి...

**-హార్టికల్చర్ ఆఫీసర్ కందుల సహజ**



**దండేపల్లి, సెప్టెంబర్ 1(ప్రజాజ్యోతి):**మంచిర్యాల డివిజన్ లోని రైతులకు ఉచితంగా మొక్కలు పంపిణి చేయనున్నట్లు మంచిర్యాల డివిజన్ హార్టికల్చర్ ఆఫీసర్ కందుల సహజ తెలిపారు. జిల్లా లోని గుడిపేట హార్టికల్చర్ నర్సరి లో మునగ, టేకు, సరుగుడు మొక్కలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. మొక్కలు పూర్తిగా ఉచితంగా ఇవ్వబడుతాయని ఆసక్తి గల రైతులు పట్టదారు పా బుక్, ఆధార్ కార్డ్ , బ్యాంక్ అకౌంట్ జీరాక్స్,పాసుపోర్టు సైజు ఫోటోతో జిల్లా హార్టికల్చర్ ఆఫీస్ మంచిర్యాల కాలెక్టరేట్ లో దరఖాస్తు చేయాలని సూచించారు.. ఒక రైతుకు వారి ఆసక్తిని బట్టి 100 నుంచి 150 మొక్కలు ఇచ్చే అవకాశం ఉన్నదన్నారు. రైతులు ఉద్యాన శాఖ ను సంప్రదించి ఈ అవకాశాన్ని వినియోగించుకోవలెనని ఆమె వెల్లడించారు.

## విద్యార్థులకు డ్రెస్సుల పంపిణీ



**జైపూర్, సెప్టెంబరు 1:** ప్రజా జ్యోతి జైపూర్ మండలంలోని కాన్కూర్ యూపీఎస్ పాఠశాలలో విద్యార్థులకు డ్రెస్సులు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ సాగరిక వెంకటేశ్వర్ గౌడ్, ఉపసర్పంచ్ నేందుగురి పూర్ణచేందర్తో పాటు వార్డు సభ్యులు విద్యార్థులకు డ్రెస్సులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి గ్రామపంచాయతీ తరపున సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది, విద్యార్థులు,గ్రామపంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

## సింగరేణి వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్

### శ్రీరాంపూర్ ఏరియా క్రీడల కమిటీ ఎంపిక

**మంచిర్యాల, 1, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** సింగరేణి వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ శ్రీరాంపూర్ ఏరియా కమిటీని 2026--27 సంవత్సరానికి ఎంపిక చేశారు. శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ క్రీడల కమిటీని ప్రకటించారు. కమిటీ అధ్యక్షులుగా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ఎస్ఓటూ జీఎం కృష్ణ ప్రసాద్, చీఫ్ కోఆర్డినేటర్గా ఎస్. అనిల్ కుమార్, హానరరీ సెక్రటరీగా కె. పాల్ సృజన్ (సీనియర్ పీఓ, ఆర్కే న్యూటెక్), ఆర్గనైజింగ్ సెక్రటరీగా శ్రీరాంపూర్ ఏరియా స్పోర్ట్స్ సూపర్వైజర్ సీహెచ్. అశోక్, కోఆర్డినేటర్గా తోట సురేష్ (ఈపీ ఆపరేటర్)లను నియమించారు. ఈ సందర్భంగా వివిధ క్రీడాంశాలకు సంబంధించి 16 మంది కెప్టెన్లను ఎంపిక చేశారు. జనరల్ కెప్టెన్గా ఎస్. నర్సయ్య (ఎస్డీఎల్ ఆపరేటర్, ఆర్కే న్యూటెక్), కల్చరల్ కెప్టెన్గా మెడ పెద్దయ్య (ఈపీ ఆపరేటర్), హాకీ కెప్టెన్గా ఎగ్గు సదయ్య (సెక్యూరిటీ గార్డు), క్రికెట్ కెప్టెన్గా బి. శశికాంత్ (సర్దార్, ఆర్కే న్యూటెక్), వాలీబాల్ కెప్టెన్గా బి. చిన్నన్న (సెక్యూరిటీ గార్డు, ఎస్టీపీపీ), అథ్లెటిక్స్ కెప్టెన్గా కె. రమేష్ (ఆర్కే--7)లను ఎంపిక చేశారు. బాస్కెట్బాల్ కెప్టెన్గా జి. బాలకృష్ణ (సెక్యూరిటీ గార్డు), ఇండోర్ కెప్టెన్గా ఎం. శ్రీనివాస్ (ఫోర్మెన్, ఎస్ఆర్పీ ఓసీ), కబడ్డీ కెప్టెన్గా కె. కార్తీక్ (కోల్కట్టర్, ఆర్కే--7), బాల్ బ్యాడ్మింటన్ కెప్టెన్గా టి. రాజమల్లు (వెల్డర్, ఎస్ఆర్పీ ఓసీ), పవర్లిఫ్టింగ్ కెప్టెన్గా బి. మల్లయ్య (ఈపీ ఫిట్టర్, ఎస్ఆర్పీ ఓసీ), వెయిట్లిఫ్టింగ్ కెప్టెన్గా ఎం. అజయ్ (జనరల్ అసిస్టెంట్, ఆర్కే న్యూటెక్)లను నియమించారు. ఫుట్బాల్ కెప్టెన్గా జి. శ్రీకాంత్ (ఎంవీ డ్రైవర్, ఐకే ఓసీ), బాడీబిల్డింగ్ కెప్టెన్గా జె. లక్ష్మణ్ (సపోర్ట్మెన్, ఎస్ఆర్పీ--1), స్విమ్మింగ్ కెప్టెన్గా ఎ. రాజేశం (కోల్కట్టర్, ఎస్ఆర్పీ--3), ఉమెన్స్ కెప్టెన్గా కె. ప్రియాంక్ (జనరల్ అసిస్టెంట్, ఎస్అండ్పీసీ)లను ఎంపిక చేశారు. ఏడాది పాటు జరిగే ఏరియా స్థాయి, కంపెనీ స్థాయి, కోల్ ఇండియా స్థాయి క్రీడా పోటీలకు ఈ కమిటీ సభ్యులు బాధ్యులుగా వ్యవహరించనున్నారు. శ్రీరాంపూర్ ఏరియా నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను ఎంపిక చేసి, వారికి అవసరమైన ప్రోత్సాహం అందిస్తూ వివిధ స్థాయి పోటీల్లో రాణించేలా కృషి చేయనున్నారు.

# బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు నిషేధాజ్ఞలు అక్టోబర్ 1 వరకు కొనసాగింపు

**అనుమతి లేని డ్రోన్లు, డీజే సౌండ్స్‌పై చర్యలు**
**-సిటీ పోలీస్ యాక్ట్ అమలు**
**రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా**



**మంచిర్యాల, 1, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** సాధారణ పౌరులు, ముఖ్యంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జోన్‌లలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను కొనసాగిస్తున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మంగళవారం తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి కొందరు వ్యక్తులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ పలు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. మద్యం మత్తులో వీధులు, రహదారులపై అసభ్య పదజాలంతో ప్రవర్తించడం వల్ల ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని, ప్రజల భద్రత దృష్ట్యా ఈ నిషేధాజ్ఞలు విధించినట్లు తెలిపారు. ఈ నిషేధాజ్ఞలు 2026 సెప్టెంబర్ 1 నుంచి అక్టోబర్ 1 వరకు అమల్లో ఉంటాయని, పరిస్థితులను బట్టి కాలపరిమితిని పొడిగించే అవకాశం ఉందని సీపీ తెలిపారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 223, హైదరాబాద్ సిటీ పోలీస్ యాక్ట్, 1348 ఫసలీ నిబంధనల ప్రకారం నిషేధాజ్ఞలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జోన్‌లలో డీజే సౌండ్స్ వినియోగంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను పొడిగించినట్లు సీపీ తెలిపారు. చిన్నపిల్లలు, వృద్ధులు, రోగులు, విద్యార్థుల విద్యాభ్యాసానికి భంగం కలగకుండా, శబ్ద కాలుష్యాన్ని నివారించేందుకు అధిక శబ్దంతో కూడిన డీజే సౌండ్స్ వినియోగంపై నిషేధం విధించినట్లు చెప్పారు. వివిధ కార్యక్రమాల సందర్భంగా ప్రజలను సమీకరించేందుకు డీజే సౌండ్స్ వినియోగిస్తున్నట్లు గమనించామని తెలిపారు. కార్యక్రమాల నిర్వహణకు మైక్ సెట్ అవసరమైతే సంబంధిత డివిజన్ ఏసీపీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. మైక్ సెట్ వినియోగానికి సంబంధించి నిర్దిష్ట మార్గదర్శకాలు ఉన్నాయని, వాటిని తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. డీజే సౌండ్స్ నిషేధాజ్ఞలు కూడా సెప్టెంబర్ 1 నుంచి అక్టోబర్ 1 వరకు అమల్లో ఉంటాయని, పరిస్థితులను బట్టి కాలపరిమితిని పొడిగించే అవకాశం ఉందని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై బీఎన్ఎస్ సెక్షన్ 223, హైదరాబాద్ సిటీ పోలీస్ యాక్ట్, 1348 ఫసలీ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లలో రామగుండం పోలీస్ కమిషనరేట్ యాక్ట్--2016లోని సెక్షన్ 7(1), సెక్షన్ 22(1)(ఎ ) నుంచి (ట), సెక్షన్ 22(2)(ఎ ), (బి ), సెక్షన్ 22(3), సిటీ పోలీస్ యాక్ట్, 1348 నం. ×శ ఫసలీ, సెక్షన్ 30, పోలీస్ యాక్ట్--1861 ప్రకారం సెప్టెంబర్ 1 ఉదయం 6 గంటల నుంచి అక్టోబర్ 1 ఉదయం 6 గంటల వరకు నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయని సీపీ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. ఈ కాలంలో రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలంటే ముందుగా సంబంధిత పోలీస్ అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. బంద్‌ల పేరుతో సంస్థలు, కార్యాలయాలను బలవంతంగా మూసివేయించడం, ఒత్తిడి చేయడం లేదా బెదిరింపులకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతి లేకుండా డ్రోన్లను వినియోగించడం, నిషేధాజ్ఞలను ఉల్లంఘించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీపీ స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని సిపి కోరారు.

# హియరింగ్‌కు రాజకీయ పార్టీలు సహకరించాలి

## జిల్లా కలెక్టర్ కె.హరిత



**ఆసిఫాబాద్ సెప్టెంబర్ 1 ప్రజా జ్యోతి** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్ ) ప్రక్రియలో భాగంగా మ్యాపింగ్ కాని, అనమలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు నోటీసులు జారీ చేసి నిర్వహిస్తున్న హియరింగ్ ప్రక్రియకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత కోరారు. సంబంధిత ఓటర్లు నిర్ణీత తేదీ, సమయానికి హాజరై అవసరమైన ధ్రువపత్రాలు సమర్పించేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు చొరవ చూపాలని సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్ లో నోటీసుల జారీ, హియరింగ్ ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలన్నారు. బూత్ స్థాయి ఏజెంట్లు కూడా ఈ ప్రక్రియలో చురుకుగా భాగస్వాములు కావాలని సూచించారు. మ్యాపింగ్ కాని, అనమలీస్ జాబితాలో ఉన్న ఓటర్లు తమ ఓటు హక్కుకు సంబంధించిన ఆధారాలతో హియరింగ్‌కు హాజరై ప్రక్రియను పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఓటర్లకు అవసరమైన ధ్రువపత్రాలతో పాటు నివాస ధ్రువపత్రాలను తహసీల్దార్ కార్యాలయాల ద్వారా త్వరగా జారీ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వెల్లడించారు. నోటీసులో పేర్కొన్న తేదీ, సమయానికి సంబంధిత ఓటర్లు హాజరై తమ వద్ద ఉన్న ఆధారాలను సమర్పించి సర్ ప్రక్రియకు సహకరించాలని కోరారు. ఓటర్లకు ఇబ్బందులు లేకుండా ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో ఎన్నికల విభాగం అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పాఠశాల విద్యార్థులకు స్టేషనరీ, వాటర్ బాటిళ్ల పంపిణీ




**దండేపల్లి, సెప్టెంబర్ 1(ప్రజాజ్యోతి):** రెబ్బనపల్లి ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ఉచితంగా స్టేషనరీ సామాగ్రి, స్టీల్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. 'బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్' స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి (ఎంఈఓ) శ్రీ మంత్రి రాజు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు ఈ వస్తువులను అందజేశారు.?ఈ సందర్భంగా ఎంఈఓ మంత్రి రాజు మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు అందించే ఇటువంటి ప్రోత్సాహాన్ని పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. క్రమశిక్షణతో కష్టపడి చదివి, భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదిగి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పేద విద్యార్థుల విద్యకు చేయూతనందిస్తున్న 'బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్' సంస్థ యాజమాన్యానికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.?ఈ కార్యక్రమంలో బిగ్ హెల్ప్ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎండి. షర్ఫుద్దీన్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## అటవీ ప్రాంతంలో పర్యటించిన విద్యార్థులు



**జన్నారం, సెప్టెంబర్ 1(ప్రజాజ్యోతి)** ములుగు, హైదరాబాద్ ఫారెస్ట్ కాలేజ్ అండ్ రిసర్చ్ ఇన్స్టిట్యూట్ కు చెందిన 50 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రొఫెసర్ డాక్టర్ మమత, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పురుషోత్తం, డాక్టర్ శ్రీను, డాక్టర్ పర్వీన్ లతో కలిసి జన్నారం డివిజన్ లోని అటవీ ప్రాంతాల్లో రెండు రోజుల పాటు పర్యటించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం రోజున ఇంధనపెల్లి రేంజ్ పరిధిలోని భర్తన్ పేట, కామన్ పెల్లి అటవీ ప్రాంతాలను సందర్శించారు. అటవీ ప్రాంతాల పరిస్థితులు, అటవీ సంరక్షణ చర్యలు మరియు క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న అటవీ నిర్వాహణ కార్యక్రమాలపై ఎఫ్ ఎస్ ఓ హన్మంతరావు విద్యార్థులకు వివరించారు. రెండవ రోజు పర్యటనలో భాగంగా మంగళవారం రోజున జన్నారం రేంజ్ పరిధిలోని పైడిపల్లి మరియు గోండుగూడ అటవీ ప్రాంతాలను సందర్శించారు. ఎఫ్ డి ఓ రామ్మోహన్, కవ్వాల్ టైగర్ ఫీల్డ్ బయోలాజిస్ట్ జోగు ఎల్లం, టెక్నికల్ అసిస్టెంట్ మహేశ్వర్ లు అటవీ జీవవైవిధ్యం, వన్యప్రాణుల సంరక్షణ, అటవీ పర్యావరణ వ్యవస్థ మరియు క్షేత్రస్థాయిలో చేపడుతున్న సంరక్షణ చర్యల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు జన్నా రం డాగ్ స్క్వాడ్ ను సందర్శించి అటవీ నేరాల నియంత్రణ, అక్రమ రవాణా మరియు వన్యప్రాణుల సంబంధిత నేరాల గుర్తింపు లో శిక్షణ పొందిన స్నిఫర్ డాగ్స్ నిర్వహిస్తున్న కీలక పాత్ర, వాటికి అందిస్తున్న శిక్షణ మరియు విధుల నిర్వహణ విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఫ్డీవో రామ్మోహన్ మాట్లాడుతూ ఈ క్షేత్ర పర్యటన ద్వారా విద్యార్థులకు తరగతి గదిలో పొందిన సైద్ధాంతిక పరిజ్ఞానాన్ని క్షేత్రస్థాయిలో తిరిగి పరిశీలించే అవకాశం లభించడంతో పాటు అటవీ సంరక్షణ, వన్యప్రాణుల పరిరక్షణ, అటవీ నేరాల నియంత్రణ మరియు జీవ వైవిధ్య పరిరక్షణపై అవగాహన కలుగుతుందని అన్నారు.

# అధిక ధరల బాదుడు..
# రూ.10 అదనంగా వసూలు చేస్తున్నారా?

## ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీ దుర్గా వైన్స్‌పై వినియోగదారుల ఆరోపణలు

## ధరలపై అధికారుల పర్యవేక్షణ కరువు.. తనిఖీలు చేపట్టాలని డిమాండ్

**ఆసిఫాబాద్ ఆర్సీ, సెప్టెంబర్01 (ప్రజాజ్యోతి):ఆసిఫాబాద్:** జిల్లా కేంద్రంలోని శ్రీ దుర్గా వైన్స్ వద్ద మద్యం సీసాలపై ముద్రించిన నిర్ణీత ధరకు అదనంగా రూ.10 వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినియోగదారుల నుంచి వినిపిస్తున్నాయి. సీసాపై ఉన్న ధరకు అనుగుణంగా విక్రయించాల్సి ఉండగా, అదనపు మొత్తాన్ని ఎందుకు తీసుకుంటున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రోజువారీగా పెద్ద సంఖ్యలో విక్రయాలు జరిగే మద్యం దుకాణాల్లో ఒక్కో సీసాపై రూ.10 చొప్పున అదనంగా వసూలు చేస్తే వినియోగదారులపై ఆర్థిక భారం పడుతుందని పలువురు పేర్కొంటున్నారు. చిన్న మొత్తమే కదా అని పట్టించుకోకుండా చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




**ధర ఒకటి.. వసూలు మరోటి?**

మద్యం సీసాపై ముద్రించిన ధర, కౌంటర్ వద్ద వసూలు చేస్తున్న ధర మధ్య తేడా ఉందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వాస్తవాలను నిర్ధారించాలని వినియోగదారులు కోరుతున్నారు. తెలంగాణ ఎక్సైజ్ శాఖ నిబంధనల్లో ఎంఆర్‌పీ ఉల్లంఘనను ప్రత్యేక ఉల్లంఘనగా పేర్కొని జరిమానాలు, పునరావృతమైతే లైసెన్స్‌పై చర్యల వరకు నిబంధనలు ఉన్నాయి. అలాగే ప్రభుత్వం నిర్దేశించిన రిటైల్ ధరకు మాత్రమే మద్యం విక్రయించాల్సి ఉంటుందని ఎక్సైజ్ నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. నిర్ణీత ధరకు భిన్నంగా విక్రయించడం నిబంధనల ప్రకారం శిక్షార్హమని అధికారిక ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

**బిల్లులు ఇస్తున్నారా?**

వినియోగదారుల నుంచి నగదు తీసుకునే సమయంలో విక్రయానికి సంబంధించిన బిల్లులు ఇస్తున్నారా? బాటిల్‌పై ఉన్న ధరకు అనుగుణంగానే నగదు తీసుకుంటున్నారా? అనే అంశాలపై కూడా అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు. దుకాణంలో ప్రదర్శించాల్సిన ఎంఆర్‌పీ వివరాలు అందుబాటులో ఉన్నాయా లేదా అన్నదీ పరిశీలించాలని కోరుతున్నారు.

**ఆకస్మిక తనిఖీలు చేపట్టాలి**

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో మద్యం విక్రయ కేంద్రాలపై సంబంధిత ఎక్సైజ్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, ధరల ఉల్లంఘనపై వస్తున్న ఆరోపణలను పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. ఆరోపణలు నిజమని తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. రూ.10 అదనపు వసూళ్ల ఆరోపణలపై అధికారులు స్పందిస్తారా? శ్రీ దుర్గా వైన్స్‌లో ధరల వ్యవహారంపై తనిఖీలు ఎప్పుడు చేపడతారో వేచి చూడాల్సిందే.

# ప్రతి ఒక్క కార్యకర్త సైనికులుగా పనిచేయాలి

## పోరుబాటను బీఆర్ఎస్ శ్రేణులు విజయవంతం చేయాలి : మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



**తాండూర్ సెప్టెంబర్ 1 ప్రజాజ్యోతి** కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టేందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టనున్న పోరుబాట ను విజయవంతం చేయాలని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు.తాండూర్: కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టేందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టనున్న పోరుబాట ను విజయవంతం చేయాలని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. తాండూర్ మండల కేంద్రంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో తెలంగాణ ప్రజలకు అమలుకాని 6 గ్యారెంటీలు, 420 హామీలను 100 రోజులలోనే అమలుచేస్తామని నమ్మించి రేవంత్ గద్దెనెక్కారని ఆరోపించారు. ప్రభుత్వం 1000 రోజులు గడిచినప్పటికీ నేటివరకూ వాటిని పూర్తిస్థాయిలో అమలుచేయకుండా వంచించినందున బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు ఈనెల 2న పోరుబాట నిరసన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. ఈ నిరసన కార్యక్రమాల్లో భాగంగా బుధవారం బెల్లంపల్లి నియోజకవర్గకేంద్రంలో ధర్నా, బాకీ కార్డులు పంచడం, 420 అడుగుల ఫ్లెక్సీ ప్రదర్శన కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సుబ్బ దత్తుమూర్తి, నాయకులు తాళ్లపల్లి పురుషోత్తం గౌడ్, మంగపతి సురేష్ బాబు, పూసాల ప్రణయ్ కుమార్, బోనగిరి చంద్రశేఖర్, మాసాడి శ్రీరాములు, గట్టు సంతోష్, మొగిలి శంకర్, ఎలక రామచందర్, జాడి పోశం, అర్జున్, పెరిక రాజన్న, బోడ సతీష్ ,చింటూ, పెరిక రాజన్న, బాబు ఖాన్ ముఖ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలకు ఉద్యోగులు పేర్లు నమోదు చేసుకోవాలి

**జిల్లా యువజన, క్రీడల అధికారి (డీవైఎస్ఓ)**

**మంచిర్యాల, 1, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం నిర్వహించనున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ (ఏఐసీఎస్) క్రీడా పోటీలలో తెలంగాణ రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసేందుకు జిల్లా స్థాయిలో వివిధ క్రీడాంశాల్లో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి (డీవైఎస్ఓ) ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, షటిల్ బ్యాడ్మింటన్, క్రికెట్, చెస్, క్యారమ్స్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డీ, లాన్ టెన్నిస్, పవర్ లిఫ్టింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్, బెస్ట్ ఫిజిక్, యోగా, ఖో–ఖో తదితర 19 క్రీడాంశాల్లో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులు మాత్రమే ఈ క్రీడా పోటీలలో పాల్గొనేందుకు అర్హులని స్పష్టం చేశారు. ఆసక్తి ఉన్న సివిల్ సర్వీసెస్ ఉద్యోగులు తాము పాల్గొనదలచిన క్రీడాంశంలో 2026 సెప్టెంబర్ 3వ తేదీలోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని డీవైఎస్ఓ కోరారు. నమోదు చేసుకున్న ఉద్యోగులకు ఎంపిక ప్రక్రియకు సంబంధించిన తదుపరి సమాచారం, ఎంపిక పోటీల తేదీలను తెలియజేయనున్నట్లు తెలిపారు. మంచిర్యాల జిల్లాలోని అర్హత కలిగిన అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిర్ణీత గడువులోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని జిల్లా యువజన, క్రీడల అధికారి విజ్ఞప్తి చేశారు. నమోదు కోసం సంప్రదించాల్సిన నంబర్. రాజేష్ మొబైల్ నెంబర్ , ౦91 99635 39234 అని మంచిర్యాల జిల్లా యువజన, క్రీడల అధికారి (డీవైఎస్ఓ) వివరించారు .

## హియరింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**



**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 1 ప్రజా జ్యోతి** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా అనమలీస్ జాబితా, మ్యాపింగ్ కాని ఓటర్లకు జారీ చేసిన నోటీసులపై హియరింగ్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కొనసాగుతున్న హియరింగ్ ప్రక్రియను ఆమె పరిశీలించారు. నోటీసులు, రిజిస్టర్లు, ఓటర్లు సమర్పిస్తున్న ధ్రువపత్రాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మ్యాపింగ్ కాని, అనమలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు నిర్ణీత గడువులోగా నోటీసులు అందజేసి హియరింగ్ నిర్వహించాలన్నారు. నోటీసులు అందుకున్న ఓటర్ల నుంచి అవసరమైన ధ్రువపత్రాలను స్వీకరించి బూత్ స్థాయి అధికారి యాప్‌లో వివరాలను నమోదు చేయాలని సూచించారు. బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి నోటీసులు అందజేయడంతో పాటు ఓటర్ల నుంచి రసీదులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ప్రతి దశను జాగ్రత్తగా పూర్తి చేయాలని ఆదేశించారు.కార్యక్రమంలో తహసీల్దార్ రియాజ్ అలీ, రెవెన్యూ సిబ్బంది, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

గణపతి మండపాల వద్ద సీ సీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలి నాణ్యమైన వస్తువులను మండల నిర్మాణానికి వినియోగించాలి

అధిక శబ్దం వచ్చే డీజేలకు అనుమతులు లేవు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

వినాయక చవితి, నవరాత్రులు, నిమజ్జనం రోజు మండప నిర్వహణ జాగ్రత్తలు పాటించాలి

యువత నవరాత్రులలో గణపతి దీక్షలో పాల్గొనాలి సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దు

గణపతి మండప నిర్వాహక సభ్యులు, హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు జిల్లా పోలీసులతో సమన్వయ సమావేశం

దస్నాపూర్ తానిషా గార్డెన్‌లో పాల్గొన్న 1000 మంది గణపతి మండప ప్రతినిధులు, నాయకులు ఉత్సవ కమిటీ సభ్యులు

గణపతి మండప నిర్వహణ కమిటీ సభ్యులు చేయవలసిన సూచనలతో కూడిన కరపత్ర ఆవిష్కరణ





**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెం బర్ 1, (ప్రజా జ్యోతి )** తెలంగాణలో ఆదిలాబాద్ జిల్లా గణపతి నవరాత్రి ఉత్సవాలకు ప్రత్యేక స్థానం ఉన్నందున, రానున్న గణపతి నవరాత్రి ఉత్సవాలను జిల్లా వ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి ముందస్తు చర్యల్లో భాగంగా గణపతి మండప నిర్వహ కమిటీ సభ్యులు, హిందూ ఉత్సవ సమితి సభ్యులతో, స్థానిక కౌన్సిలర్లు, నాయకులచే సమన్వయ సమావేశాన్ని జిల్లా పోలీసు యంత్రాంగం మంగళ వారం ఉదయం స్థానిక ప ట్టణంలోని తానిషా గార్డెన్ లో ఏర్పాటు చేశారు. మొదటగా వేద పండితుల ఆధ్వర్యంలో గణపతి స్తోత్రా న్ని పటిస్తూ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సమన్వయ సమావేశం లో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీ ఎస్ ముఖ్యఅతిథిగా పాల్గొని మండప నిర్వహణ కమి టీలు సభ్యులకు పలు సూచనలు చేశారు. సంస్కృతిని, సాంప్రదాయాన్ని కాపాడుతూ, దానిని భావితరాలకు స్ఫూర్తిదాయకంగా ఉండేలా గణపతి నవరాత్రి ఉత్సవాలను నిర్వహించాలని జిల్లా ఎస్పీ తెలియజేశారు. ఈ గణపతి విగ్రహాల ఏర్పాటు అనే పండుగ, ప్రశాంత వాతావరణంలో ప్రజలందరూ కలిసి మెలిసి నిర్వహించుకోవాలని జిల్లా పోలీసు యంత్రాంగం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. పోలీసు యంత్రాంగం పూర్తి సంసిద్ధంగా ఉందని మండప నిర్వహణ కమిటీ సభ్యులను ఉద్దేశించి పలు సూచనలు చేశారు. త్వరలో ఆన్లైన్లో వచ్చే లింకు ద్వారా ప్రతి ఒక్క గణపతి మండపం రిజిస్ట్రేషన్ ఏర్పా టు చేసుకోవాలని, దీని ద్వారా గణపతి నవరాత్రి ఉత్స వాలలో చేయవలసిన బందోబస్తు కేటాయించవలసిన పోలీసు సిబ్బంది నిమర్జనం ఏర్పాట్లకు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు పాటిస్తూ ఏర్పాట్లను పూర్తి చేస్తున్నట్టు తెలిపారు. గ్రామాలలో సాధ్యమైనంతవరకు ఒకే గణపతి మండపం ఏర్పాటు చేసే విధంగా ప్రజలందరూ కలిసికట్టుగా ఉన్న భావాన్ని తెలియజే యాలన్నారు. గతంలో ఏర్పాటు చేసిన గణపతి మండపాలకు మాత్రమే అనుమతులు ఉన్నాయని, నూతనంగా ఏర్పాటు చేసే వారికి అనుమతులు లేవని తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఆదిలా బాద్ పట్టణంలో జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలలో ఏర్పాటు చేయనున్న గణపతి మండప నిర్వాహక కమిటీ సభ్యులు దాదాపు 1000 మంది పాల్గొన్నారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఎఎస్పి రుత్విక్ సాయి కొట్టే ఐపీఎస్, ఆదిలాబాద్ డి ఎ స్పీ ఎల్ జీవన్ రెడ్డి, మున్సి పల్ చైర్ పర్సన్ బండారి అనూష, స్థానిక కౌన్సిలర్లు, ఏఆర్ డీఎస్పీ కమతం ఇంద్ర వర్ధన్, పట్టణ సిఐలు బి సునీల్ కుమార్, కె నాగరాజు, బీడీ ప్రేమ్ కుమార్, సర్కిల్ ఇన్స్పెక్టర్లు జి శ్రావణ్, సిహె చ్ రమేష్, కే నరేష్, ఎం ప్ర సాద్, డి గురుస్వామి, రిజ ర్వ్ ఇన్స్పెక్టర్లు డి వెంకటి, టి మురళి,ఎన్ చంద్రశేఖర్, ఎస్సైలు సిబ్బంది, హిందు ఉత్సవ సమితి జిల్లా అధ్య క్షుడు బొంపల్లి హనుమన్లు, నూతన అధ్యక్షుడు, హిం దూ ఉత్సవ సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



**గణేష్ మండపాలు ఏర్పాటు చేసేవారికి ఆదిలాబాద్ జిల్లా పోలీసుల సూచనలు**

గణేశుని మండపాల వద్ద 24 గంటలు కనీసం ముగ్గురు వాలంటీర్లు విగ్రహంతో పాటు ఉండాలి. జంతువులు, కోతులు లోనికి రా కుండా చూసుకోవాలి. గణే శుని మండపాల నిర్వాహకు లు తప్పనిసరిగా సిసి కె మె రాలు ఏర్పాటు చేసుకునేలా చూడాలి. విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు ఎలాంటి శా శ్వత నిర్మాణాలు చేపట్ట రాదు.వినాయక మండపం ఏ ర్పాటులో, నిర్మాణంలో అ న్ని మన్నికవున్న వస్తువులనే వాడాలి.ప్రజల తాకిడి, వర్షం పడితే నీళు నిలవడం, గాలి వీచినపుడు ఇ బ్బంది కలగడం, కూలిపో కుండా చూడటం వంటి బాధ్యతను కమిటీ సభ్యులు చూసుకోవాలి. ఈ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి.విద్యుత్ శాఖ నుండి పవర్ సప్లయ్ మరియు రక్షణకు సంబంధించిన సూచనలు తీసుకోవాలి విద్యుత్ కనెక్షన్లు, లైట్ల ఏర్పాటుకు నాణ్య మైన వైర్లను, పరికరాలను వినియోగించాలి. ప్రమాదము జరగకుండా చూసుకోవాలి. మండపాల పైభాగంలో నీరు పడినా కిందకు జారిపోయే పట్టాలతో కప్పాలి. ప్రజలకు ఇబ్బంది కలిగే విధముగా దారిలో మండపాలు ఏర్పాటు చేయరాదు. ప్రైవేట్ ల్యాండ్ అయినచో మండపాలు ఏర్పాటు చేసే స్థలానికి యజమాని పర్మిష న్ తీసుకోవాలి.రాత్రి 10 గం టల తరువాత మైక్, సౌండ్ సిస్టమ్ ఉపయోగించి ప్రజలకు, ఇతరులకు ఇబ్బందులు చేయకూడదు. మండపాల పేరుతో ఎలాంటి లక్కీ డ్రాలు నిర్వహించకూడదు. అలాగే జూదాన్ని నిర్వహించరాదు. బలవంతపు చందాలు తీసుకోరాదు.గణేశుని మండపాల వద్దకు మద్యం సేవించి రాకుండా కమిటీ నిర్వాహకులు చూసుకోవాలి.మండపాల వద్ద ఎలాంటి టపాసులు కాల్చరాదు.పెద్ద పెద్ద శబ్దాలతో డిజెలు ఏ ర్పాటు చేయకూడదు. అత్యవసరం అయితే డైల్ 100/112 కు కాల్ చేయాలి.వినాయకుని ఉత్సవాలను అందరూ భక్తిశ్రద్ధలతో, సమైక్యంగా ప్రశాంతంగా జ రుపుకోవాలని సూచన.ప్రతి గణపతి మండపం వద్ద అగ్ని ఆర్పడానికి కావలసిన నీరు, ఇసుక లాంటివి ఏర్పాటు చేయాలి. రంగురంగుల పేపర్లను చల్లె పరికరాలకు, వాటికి అనుమతులు లేవని తెలిపారు.గణపతి ఏర్పాటు పేరుతో జరిగే చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జ రగకుండా ఉండాలి.సోషల్ మీడియాలో వచ్చే వదంతు లను నమ్మవద్దు, ఇలాంటి సమాచారం కైనా జిల్లా పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించాలి అని పోలీసులు సూ చనలు జారీ చేశారు.

# కొత్త లేబర్ కోడ్‌లలో కార్మిక వ్యతిరేక అంశాలను సవరించాలి

**కేంద్ర కార్మిక శాఖ మంత్రి డా. మన్సుఖ్ మాండవీయతో బీఎంఎస్ ఉన్నతస్థాయి సమావేశం**

**మంచిర్యాల, 1, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** కొత్త లేబర్ కోడ్‌లలో కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న అంశాలను సవరించాలని భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు ఈ అంశాలపై కేంద్ర కార్మిక శాఖ మంత్రి డా. మన్సుఖ్ మాండవీయతో బీఎంఎస్ నాయకులు ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్‌లోని కార్మిక వ్యతిరేక నిబంధనలపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఆగస్టు 17న దేశవ్యాప్తంగా నిర్వహించిన నిరసన కార్యక్రమం అనంతరం కార్మికుల సమస్యలు, డిమాండ్లపై ప్రధానమంత్రి, కేంద్ర కార్మిక శాఖ మంత్రి, కేంద్ర ఆర్థిక మంత్రికి బీఎంఎస్ తరపున డిమాండ్లను సమర్పించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్‌పై కేంద్ర మంత్రితో బీఎంఎస్ నాయకత్వం చర్చలు జరిపారు ఈ సమావేశంలో బీఎంఎస్ జాతీయ అధ్యక్షులు సుకురి మల్లేశం, ప్రధాన కార్యదర్శి సురేంద్ర కుమార్ పాండే తదితరులు పాల్గొని కార్మికుల సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

**బీఎంఎస్ ప్రధాన డిమాండ్లు – సామాజిక భద్రత పరిమితులను పెంచాలి:**

ప్రస్తుత పరిమితులను పెంచాలని బీఎంఎస్ డిమాండ్ చేసింది. ఉద్యోగుల భవిష్యనిధి (ఈపీఎఫ్) వేతన పరిమితిని రూ.15 వేల నుంచి రూ.30 వేలకు, బోనస్ పరిమితిని రూ.21 వేల నుంచి రూ.42 వేలకు, ఈఎస్ఐ వేతన పరిమితిని రూ.21 వేల నుంచి రూ.42 వేలకు పెంచాలని కోరింది.

**'హైర్ అండ్ ఫైర్' విధానాన్ని నిలిపివేయాలి:**

ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్, స్టాండింగ్ ఆర్డర్ నిబంధనలు వర్తించే సంస్థల్లో కార్మికుల సంఖ్యకు సంబంధించిన పరిమితిని ప్రస్తుత 300 మంది నుంచి తిరిగి 100 మందికి తగ్గించాలని బీఎంఎస్ కోరింది. తద్వారా యాజమాన్యాలు ఇష్టానుసారంగా ఉద్యోగులను తొలగించే అవకాశం లేకుండా చూడాలని డిమాండ్ చేసింది.

**ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్‌ను పరిమితం చేయాలి:**

శాశ్వత ఉద్యోగుల సంఖ్యలో ఫిక్స్‌డ్ టర్మ్ ఉద్యోగులు 10 శాతానికి మించకుండా పరిమితం చేయాలని బీఎంఎస్ సూచించింది. సంస్థల్లో నిరంతరం కొనసాగుతున్న రెగ్యులర్ పనులకు శాశ్వత ఉద్యోగులనే నియమించాలని కోరింది.

**ట్రేడ్ యూనియన్ గుర్తింపు నిబంధనలను సవరించాలి:**

ట్రేడ్ యూనియన్ గుర్తింపునకు 51 శాతం సభ్యత్వం, నెగోషియేటింగ్ కౌన్సిల్‌కు 20 శాతం సభ్యత్వానికి సంబంధించిన నిబంధనలు ఆచరణలో సాధ్యం కావని బీఎంఎస్ పేర్కొంది. ఈ నిబంధనలను కార్మికులకు అనుకూలంగా సవరించాలని కోరింది.

**'డీమ్డ్ రిజిస్ట్రేషన్' నిబంధన చేర్చాలి:**

ట్రేడ్ యూనియన్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో నిర్ణీత సమయంలో అధికారుల నుంచి స్పందన లేకపోతే ఆటోమేటిక్‌గా రిజిస్ట్రేషన్ జరిగినట్లుగా పరిగణించే డీమ్డ్ రిజిస్ట్రేషన్ నిబంధనను చట్టంలో చేర్చాలని బీఎంఎస్ డిమాండ్ చేసింది.

**వర్కర్ నిర్వచనాన్ని విస్తరించాలి:**

వర్కర్ నిర్వచనంలో సూపర్‌వైజర్లకు సంబంధించిన ప్రస్తుత రూ.18 వేల వేతన పరిమితిని పెంచాలని బీఎంఎస్ కోరింది. అలాగే సమ్మె హక్కుకు సంబంధించిన ముందస్తు నోటీసు నిబంధనలను సడలించాలని డిమాండ్ చేశారు.

**అన్ని అంశాలను పరిశీలిస్తాం: కేంద్ర మంత్రి**

బీఎంఎస్ ప్రతినిధులు లేవనెత్తిన అన్ని అంశాలను కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని కేంద్ర కార్మిక శాఖ మంత్రి డా. మన్సుఖ్ మాండవీయ హామీ ఇచ్చినట్లు బీఎంఎస్ తెలిపింది. కార్మికుల డిమాండ్లపై తగిన చర్యలు తీసుకుని, అవసరమైన చోట లేబర్ కోడ్‌లో సవరణలు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. త్వరలో ఓఎస్‌హెచ్ కోడ్‌పై సమావేశం. తదుపరి దశలో ఆక్యుపేషనల్ సేఫ్టీ, హెల్త్ అండ్ వర్కింగ్ కండిషన్స్ కోడ్ (ఓఎస్‌హెచ్ కోడ్)లపై కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరగనున్నట్లు బీఎంఎస్ నాయకులు తెలిపారు. కార్మికుల భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితులకు సంబంధించిన అంశాలపై కూడా తమ డిమాండ్లను కేంద్రం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వివరించారు.

# లక్ష్య సాధనకు స్మార్ట్ వర్క్ ముఖ్యం

## జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెం బర్ 1, (ప్రజా జ్యోతి)** పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే కఠోర శ్రమతో పాటు ప్రణాళికాబద్ధమైన 'స్మార్ట్ వర్క్' ఎంతో అవసర మని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం జి ల్లా కేంద్రంలోని బీసీ స్టడీ స ర్కిల్‌లో ఉమ్మడి ఆదిలాబా ద్ జిల్లాకు చెందిన మెరిట్ అభ్యర్థులకు ఫౌండేషన్ కో ర్సు శిక్షణ తరగతులను ఆయన ముఖ్య అతిథిగా హా జరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ముందుగా బిసి స్టడీ సర్కిల్ ద్వారా శిక్షణ పొంది ఉద్యోగం సాధించిన పలువురు అభ్యర్థులు వారి అభిప్రాయా లను వెల్లడించారు. అనంతరం వారిని శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ సిలబస్‌పై పూర్తి పట్టు సాధించి, పరిమితమైన ప్రామాణిక పుస్త కాలను మాత్రమే ఎంచుకోవాలని సూచించారు. స్టాటి క్ అంశాలను సమకాలీన పరిణామాలతో (కరెంట్ అఫైర్స్) అనుసంధానిస్తూ నోట్స్ తయారు చేసుకోవాలని, ఇది మెయిన్స్ ఆన్సర్ రైటింగ్‌కు ఎంతో దోహదపడుతుందన్నారు. ఆబ్జెక్టివ్ పరీక్షల్లో ప్రశ్నలకు సమా ధానాలు గుర్తించడంలో 'ఎలిమినేషన్ మెథడ్' కీలకమని, దీనికోసం అధిక



సంఖ్యలో మోడల్ పేపర్లు, మాక్ టెస్టులు ప్రాక్టీస్ చేయాలని స్పష్టం చేశారు. అభ్యర్థులు ప్రిపరేషన్ సమయంలో స్మార్ట్‌ఫోన్లు, సామాజిక మాధ్యమాల వంటి ఆటంకాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో చదవాలని సూచించారు. త్వరలో ప్రభుత్వం నుంచి పలు ఉద్యోగ నోటిఫికేషన్లు వెలు వడనున్న నేపథ్యంలో, బీసీ స్టడీ సర్కిల్ అందించే శిక్షణను, అధ్యాపకుల మార్గదర్శ కత్వాన్ని, అభ్యర్థులు నూటి కి నూరు శాతం సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధిం చాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి జిల్లా బిసి సంక్షే మ శాఖ అధికారి సునీతకుమారి, స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్, అధ్యా పకులు, ఉద్యోగ విజేతలు, అభ్యర్థులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతులను బలి చేసి భూకబ్జాదారులను కాపాడొద్దు

**22 పై తక్షణ న్యాయం చేయాలి**

**అర్హులైన రైతుల భూములను 22 జాబితా నుంచి తొలగించి, సామాన్యులకు నష్టం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి**

**కాంగ్రెస్ నాయకులు, న్యాయవాది జావిద్ అలీ ఖాన్**



**ఆసిఫాబాద్ ఆర్సీ, సెప్టెం బర్01 (ప్రజాజ్యోతి):** ఆసిఫాబాద్, కాగజ్‌నగర్: 22 నిషేధిత భూముల జాబితాలో ఉన్న అర్హులైన రైతుల భూములను సమగ్రంగా పరిశీలించి, చట్టపరంగా అర్హత ఉన్న భూములను వెంటనే 22 జాబితా నుంచి తొలగించి రైతులకు న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు, న్యాయవాది జావిద్ అలీ ఖాన్ ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికే రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి 22–గా భూముల సమస్యపై స్పందించి ప్రకటన చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. గత ప్రభుత్వాల కాలంలో జరిగిన తప్పిదాలు, రెవెన్యూ రికార్డుల్లో చోటుచేసుకున్న అవకతవకల కారణంగా నేడు సామాన్య ప్రజలు, రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని జావిద్ అలీ ఖాన్ అన్నారు. ఇది ప్రజా ప్రభుత్వం. ఏ పరిస్థితుల్లోనూ సామాన్య ప్రజలకు, నిజమైన రైతులకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో పేదలకు లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేసి భూమిలేని నిరుపేదలకు అండగా నిలిచింది. అదే స్ఫూర్తితో నేడు కూడా అర్హులైన రైతుల భూములను రక్షించాలి అని ఆయన తెలిపారు. ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమించుకున్నట్లు నిర్ధారణ అయ్యే రాజకీయ నాయకులు లేదా ఇతర వ్యక్తుల భూములు 22–గా జాబితాలో ఉన్నట్లయితే, వాటిపై కూడా సమగ్ర విచారణ జరిపి, చట్ట ప్రకారం ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అటువంటి భూములను భూమిలేని నిరుపేదలకు కేటాయించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని కోరారు. అదే సమయంలో, ఏళ్లుగా భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న అర్హులైన రైతులను ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టపరచకూడదని ఆయన స్పష్టం చేశారు. ప్రతి భూమికి సంబంధించిన పాత రికార్డులు, పట్టాలు, సాగు వివరాలు, హక్కు పత్రాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని సూచించారు. రైతులు తమ భూముల సమస్యను పరిష్కరిస్తామని చెప్పే మధ్యవర్తుల మాటలు నమ్మి డబ్బులు చెల్లించి మోసపోవద్దని జావిద్ అలీ ఖాన్ హెచ్చరించారు. ప్రభుత్వ అధికారుల పేర్లు చెప్పుకుంటూ డబ్బులు వసూలు చేసే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సమస్యల పరిష్కారం కోసం సంబంధిత రెవెన్యూ కార్యాలయాల్లో అధికారికంగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రెవెన్యూ అధికారులు ఈ సమస్యను యుద్ధప్రాతిపదికన పరిశీలించి, అర్హులైన రైతులకు త్వరితగతిన న్యాయం చేయాలని ఆయన కోరారు. రైతుల భూములను అన్యాయంగా 22–గా నిషేధిత జాబితాలో కొనసాగించి వారికి నష్టం కలిగిస్తే, బాధిత ప్రజల తరపున చట్టపరమైన మార్గాలను అనుసరించి న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి వస్తుందని జావిద్ అలీ ఖాన్ పేర్కొన్నారు.ప్రభుత్వ భూములను కాపాడటం ఎంత ముఖ్యమో, నిజమైన రైతుల భూములను రక్షించడం కూడా అంతే ముఖ్యం. గత ప్రభుత్వాల తప్పిదాల భారాన్ని సామాన్య రైతులపై మోపకూడదు. ప్రజా ప్రభుత్వం ప్రజల పక్షాన నిలబడి న్యాయబద్ధమైన పరిష్కారం చూపాలని జావిద్ అలీ ఖాన్ ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు.

## దిశ కమిటీ సభ్యుల నియామకం

**ఆదిలాబాద్ ఎంపీ, దిశ కమిటీ చైర్మన్ జి. నగేష్**

**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెం బర్ 1, (ప్రజా జ్యోతి** )జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ" దిశ సభ్యులుగా పలువురిని ఆదిలాబాద్ పార్ల మెంట్ సభ్యులు, దిశ కమిటీ చైర్మన్ గోడం నగేష్ నామినేట్ చేసి ప్రకటించారు. వారిలో తందూరి అరుణ్ కుమార్ ( తాంసి), సురేందర్ (ఆదిలాబాద్), నివేదిత వజే (ఆదిలాబాద్),పెందుర్ తులసి రామ్ (ఇచ్చోడ), రాకేష్ యాదవ్ (సర్పంచ్ అంతర్ గావ్) బింపూర్, మెస్రంతు కారాం (సర్పంచ్ కేస్లాపూర్) ఇంద్రవెల్లి,గాజుల ప్రద్యుమ్న (సర్పంచ్ గిమ్మా) బోరజ్, గోపల్లి అనిత (సర్పంచ్ అర్లీ -బి), ఆదిలాబాద్ గ్రామీణ బొడ్డే పూనం (సర్పంచ్ మన్నూర్) గుడిహత్నూర్‌లను నియమిస్తూ ఉత్తర్వులు జారి చేయడం జరిగిందని దిశ కమిటీ చైర్మన్ ఎం.పీ గోడం నగేశ్ తెలిపారు.

## ఎస్సీ, ఎస్టీ సమస్యల సత్వర పరిష్కారానికి కృషి

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**





**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 1 (ప్రజా జ్యోతి )** ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద నమోదైన కేసుల దర్యాప్తు ను వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వ హించిన జిల్లా స్థాయి పర్య వేక్షణ, సమీక్ష కమిటీ సమా వేశానికి ఆయన ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్ట ర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గాలపై జరుగుతున్న అన్యాయాలను అరికట్టేందుకు, వారి హక్కులను కాపాడేందుకు చట్టపరంగా తగిన రక్షణ కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో నమోదైన వివిధ కేసులు, వాటి ప్రస్తుత స్థితిగతులపై సమీక్షించారు. ముఖ్యంగా అత్యాచార కేసులలో బాధితులకు అందాల్సిన నష్టపరిహారాన్ని వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని, కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు పునరావాసం క ల్పించడంతోపాటు, వారిలో ధైర్యం నింపేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ చట్టపరంగా ఎలాంటి లోపాలు లేకుండా కట్టుదిట్టమైన దర్యాప్తు చేపట్టి, నేర స్తులకు శిక్ష పడేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సమావే శంలో అదనపు కలెక్టర్లు ఆర్. ఎస్. చిత్రూ, ఎస్.రాజేశ్వర్, డిప్యూటీ కలెక్టర్ వంశీ కృష్ణ, ఎస్సీ సంక్షేమ అధికారి సునీత కుమారి, ఈడి మనోహర్, ఇతర శాఖల అధికారులు, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## సోనాలలో నూతన లైబ్రరీ ప్రారంభం



**సోనాల సెప్టెంబర్ 01 ప్రజాజ్యోతి** గ్రామీణ ప్రాంత విద్యార్థులు, నిరుద్యోగ యువత భవిష్యత్తును తీర్చిదిద్దే లక్ష్యంతో సోనాలా గ్రామంలో ఏర్పాటు చేసిన నూతన గ్రంథాలయాన్ని (లైబ్రరీ) ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తో పాటు గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నరసయ్య వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్ , ఈనాటి సాంకేతిక యుగంలో పుస్తక పఠనం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు, ఉన్నత చదువులు చదువుతున్న విద్యార్థులకు ఈ లైబ్రరీ ఒక అద్భుతమైన వేదికగా ఉపయోగపడుతుందన్నారు.

## ఎంపీ జీ నగేష్ ని కలిసిన నూతన "దిశ" సభ్యులు



**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెం బర్ 1, (ప్రజా జ్యోతి)** జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సభ్యులుగా నామినేట్ చేయబడిన నూతన సభ్యులు పెందుర్ తులసిరామ్ (ఇచ్చోడ) మెస్రం తుకారం కేస్లాపూర్ (ఇంద్రవెల్లి) సర్పంచ్‌లు మంగళవారం ఆదిలాబాద్ పార్ల మెంట్ సభ్యులు గోడం నగేష్‌ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపిని శాలువాలతో సత్క రించికృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ తాటిపల్లి గంగాధర్ రావు, మాజీ రైల్వే బోర్డు మెంబర్ జివి రమణ, ఇచ్చోడ, ఇంద్రవెల్లి మండలాల నాయకులు, కార్యక ర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తొలితరం మహిళా మావోయిస్టు రాధాక్కకి నివాళులు అర్పించిన మాజీ ఎంపీ సోయం బాపూరావు



**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్1, (ప్రజా జ్యోతి** )ఉమ్మడి ఆదిలా బాద్ జిల్లా పిపుల్స్‌వార్ ఉద్యమాన్ని ఊర్రుతలు ఉగించిన తొలితరం మహిళా మావోయిస్టు రాధాక్క ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాగా మంగళవారం మాజీ ఎంపీ మాజీ ఎమ్మెల్యే రాజ్ గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు సోయం బాపూరావు అంతక్రియల్లో పాల్గొని నివాళులు అర్పించారు.వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢా సానుభూతి వెక్తం చేశారు.సోయం వెంట మాజీ డి సి సీబీ చేర్మెన్ అడ్డి భోజ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు సతీమణిని పరామర్శించిన డీసీసీ అధ్యక్షురాలు సుగుణ



**ఆసిఫాబాద్ సెప్టెంబర్ 1 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు సతీమణిని జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షురాలు ఆత్రం సుగుణ పరామర్శించారు. అనారోగ్యంతో ఉన్న ఆమెను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యుల సూచనలు, ప్రస్తుతం అందుతున్న చికిత్సకు సంబంధించిన వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్న సుగుణ, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆమెకు ధైర్యం చెప్పి, ఆరోగ్యంపై ఎలాంటి ఆందోళన చెందవద్దని సూచించారు. కుటుంబ సభ్యులతో కొద్దిసేపు మాట్లాడిన ఆమె, అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తాము ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని తెలిపారు. ఈ పరామర్శ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాపర్తి మురళి, కాంగ్రెస్ నాయకులు ఇంద్ర, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా ఉద్యాన అధికారి గుడిమల్ల సందీప్ కుమార్**



**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 1, (ప్రజా జ్యోతి)** సాంప్రదాయ పంటలకు భిన్నంగా వాణిజ్య ఉద్యాన పంటల సాగువైపు రైతులు మొగ్గు చూపాలని, ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం అందిస్తు న్న వివిధ రాయితీలను సద్వినియోగం చేసు కోవాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి గుడిమల్ల సందీప్ కుమార్ సూచించారు. మంగళవారం బేల మండలం మంగ్రూల్ గ్రామంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమగ్ర ఉద్యాన మిషన్‌లో భాగంగా మామిడి, జామ, నిమ్మ, సీ తాఫలం, అంజీర్, పసుపు తదితర పంటల సాగుకు, అలాగే బిందు సేద్య పరిక రాలకు ప్రభుత్వం రాయితీలు అందిస్తోందని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొనే రైతులు ప్లాస్టిక్ మల్చింగ్, కూర గాయలు, పూల తోటల సాగు ద్వారా మెరుగైన ఆదాయం పొందవచ్చని సూచించారు. అనంతరం మంగ్రూల్‌లోని పామాయిల్ తోటను పరిశీలించి రైతులకుసాగు పై సూచనలు చేశారు. సుమారు 40 సంవత్సరాల పాటు ఆదాయం అందించే పామాయిల్ సాగు వైపు రైతులు ముందుకు రావాలని కోరారు. చాంద్‌పల్లి గ్రామంలో జాతీయ వెదురు పథకం కింద ఎంపికైన రైతులకు నాణ్యమైన హైబ్రిడ్ వెదురు మొక్కలను పంపిణీ చేశారు. అనంతరం పసుపు, మునగ, వంగ, టమాటా, మిర్చి పంటలను పరిశీలించి సమగ్రయాజమాన్య పద్ధతులపై రైతులకు సూచ నలు అందించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి అలేఖ్య, ఉద్యాన శాస్త్రవేత్త మల్లేష్, మండల వ్యవసాయ అధికారి సాయి తేజ, సీపీఎఫ్ స్వచ్ఛంద సంస్థ అధికారి సత్యనారాయణ, సిబ్బంది మంగేష్, పూజ, రైతులు పాల్గొన్నారు

# రెండు ఎకరాల పొలం... లక్షల ఆదాయం

: ఆదర్శంగా నిలుస్తున్న కుప్టి రైతు

**నేరడిగొండ సెప్టెంబర్ 01 (ప్రజా జ్యోతి):** సాంప్రదాయ పంటలైన పత్తి, సోయాసాగు చేసి నష్టపోయిన ఆ రైతు అధైర్యపడలేదు. అవే పంటలను నమ్ముకొని నష్టపోవడం కంటే, ప్రత్యామ్నాయ సాగువైపు అడుగులు వేసి లాభాలు గడిస్తూ తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. నేరడిగొండ మండలంలోని కుప్టి గ్రామానికి చెందిన రైతు బాధ వెంకటరమణ తనకున్న రెండెకరాల పొలంలో కూరగాయల సాగు ప్రారంభించాడు. ఒక ఎకరంలో వంకాయ, 20 గుంటల్లో పచ్చిమిర్చి, మరో 20 గుంటల్లో టమాటా పంటలను మూడు నెలల కిందట సాగు చేశాడు.

**పెట్టుబడి తక్కువ.. ఆదాయం మెండు:**

ఈ పంటల సాగు కోసం విత్తనాలు, మందుల పిచికారీ, కూలీలు, రవాణా ఇతర ఖర్చుల కోసం ఇప్పటివరకు సుమారు 1,00,000 పెట్టుబడి పెట్టగా, పంట దిగుబడి ప్రారంభమై ఇప్పటి వరకు 1,50,000 రాబడి వచ్చింది. రాబోయే మరో రెండు నెలల కాలంలో ఇంకో 2,00,000 వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉందని రైతు హర్షం వ్యక్తం చేశారు.

**మార్కెట్ లలో సదుపాయాలు కల్పించాలి:**

ఈ సందర్భంగా రైతు వెంకటరమణ 'ప్రజా జ్యోతి'తో మాట్లాడుతూ.. వారానికి రెండుసార్లు తమ పంట ఉత్పత్తులను సమీపంలోని ఇచ్చోడ, నేరడిగొండ, బోథ్ మార్కెట్లకు తరలించి విక్రయిస్తున్నట్లు తెలిపారు. అయితే మార్కెట్లలో రైతులకు సరైన వసతులు లేక ఎక్కడ పడితే అక్కడ అమ్ముకోవాల్సి వస్తోందని, అంతేకాకుండా ప్రతి బుట్టకు రు "10 చొప్పున రుసుము వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మార్కెట్లలో రైతులకు తగిన వసతులు కల్పించాలని, బుట్టకు రు "10 చొప్పున వసూలు చేసే రుసుమును రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.



**కూరగాయల సాగుకు ఉద్యాన శాఖ ప్రోత్సాహం: హెచ్.ఓ భూమయ్య**

మండలంలో కూరగాయల సాగు విస్తీర్ణం, దిగుబడి పెంపొందించేందుకు ఉద్యాన శాఖ ద్వారా నిధులు విడుదల చేస్తున్నట్లు ఉద్యాన విస్తరణ అధికారి సి.హెచ్. భూమయ్య తెలిపారు. హైబ్రిడ్ రకాలకు ప్రోత్సాహకం: 'మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ ఆఫ్ హార్టికల్చర్' పథకంలో భాగంగా టమాటో, మిర్చి, వంకాయ, క్యాలిఫ్లవర్, క్యాబేజీ వంటి అధిక దిగుబడినిచ్చే హైబ్రిడ్ రకాలను సాగు చేసే రైతులకు ఎకరానికి రు "9,600 నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరుగుతుంది. ఊత కర్రలకు సబ్సిడీ: పంట నాణ్యత, దిగుబడి పెంచడానికి ఉపయోగించే ఊత కర్రల కోసం ఎకరానికి రు "4,000 సబ్సిడీ అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తిగల రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

# గ్రామ ప్రజల సౌకర్య దిశలో విద్య వైద్య సామాజిక ఉచిత సేవలో పాత ఎల్లాపూర్ సర్పంచ్ ఏలేటి ప్రశాంత్ రెడ్డి



## నేడు ఉచిత అంబులెన్స్ ఎమ్మెల్యే చే ప్రారంభోత్సవం

**ఖానాపూర్ సెప్టెంబర్ 1( ప్రజా జ్యోతి )** ప్రజాసేవే పరమార్థంగా మానవసేవే మాధవసేవగా గతంలో పూర్వీకులు పాటించిన విధానాన్ని అమలు చేస్తూ ప్రజలకు ఉచిత సౌకర్యాలు అందిస్తున్న యువ పాత ఎల్లాపూర్ సర్పంచ్ ఏలేటి ప్రశాంత్ రెడ్డి నేడు ఉచిత అంబులెన్స్ వాహనాన్ని ప్రారంభించనున్నారు ఖానాపూర్ మండలంలోని పాతెల్లాపూర్ సర్పంచ్‌గా ఎన్నికైన నుండి నేటి వరకు మొదట ఉచిత మెగా క్యాంపు ఏర్పాటు చేసి వైద్య సేవలో పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందజేశారు అనంతరం గ్రామ ప్రజలకు కార్మిక సంక్షేమ బీమా పథకం కింద 210 మందికి ఉచిత బీమా పథకాలను అందజేశారు అదేవిధంగా



పాతెల్లాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో రాజ్యాంగ నేత బడుగు బలహీనవర్గాల ప్రధాన బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఇటీవల సొంత ఖర్చుతో ఆవిష్కరించారు విద్యార్థులు సర్కారు బడులకు వెళ్లే విధంగా తన గ్రామపంచాయతీ పాత ఎల్లాపూర్ లో గల జడ్పిహెచ్ఎస్ పాఠశాలకు రావడానికి రవాణా సౌకర్యాన్ని చార్జింగ్ ఆటో ద్వారా చుట్టుపక్కల గ్రామాలకు విద్యార్థులను ఉచితంగా పాఠశాలకు చేర్పించే కార్యక్రమాన్ని చేపట్టడం గమనార్హం ఇలా తన పంచాయతీ పరిధిలోని గ్రామాలతో పాటు ప్రజలకు విద్య వైద్యం సామాజిక సేవలను అందిస్తున్న తరుణంలో ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జుపటేల్ చే పై కార్యక్రమాలను నిర్వహించి నేడు అంబులెన్స్ సౌకర్యాలు సైతం ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించినట్లు సర్పంచ్ ఏలేటి ప్రశాంత్ రెడ్డి తెలిపారు ఈ మేరకు ప్రశాంత్ రెడ్డి సేవలకు కృతజ్ఞులుగా పంచాయతీ ప్రజలు అభినందిస్తున్నారు

## తేజాపూర్‌లో ఎస్ఐఆర్‌పై ప్రత్యేక సభ



**నేరడిగొండ, సెప్టెంబర్ 01 (ప్రజాజ్యోతి):** తేజాపూర్ గ్రామంలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా మంగళవారం ప్రత్యేక సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితాలో పేర్లు, వివరాల్లో తప్పులు ఉన్న వారి నుంచి సవరణల కోసం దరఖాస్తులతో పాటు సంబంధిత గుర్తింపు పత్రాలను అధికారులు స్వీకరించారు. అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలను పరిశీలించుకుని, తప్పులు ఉంటే సకాలంలో సరిచేసుకునేలా అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గంగాసాగర్ రెడ్డి, ఆర్ఐ సాయి, జీపీఓ వినోద్, బీఎల్ఓ కమలాకర్, గ్రామ సర్పంచ్ సింగరి వసుంధర నవీన్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రో జుల పాలనలో ప్రజా సంక్షే మానికి పెద్దపీట

**ఐఎన్ టి యు సి జిల్లా అధ్యక్షుడు మునిగెల నర్సింగ్**

**గుడిహత్నూర్ మండల అధ్యక్షుడిగా రాజు నియామకం**



**గుడిహత్నూర్, సెప్టెంబర్ 1, (ప్రజా జ్యోతి )** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రె స్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్త యిన సందర్భంగా ఐఎన్ టి యు సి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు మునిగెల నర్సింగ్ మాట్లాడుతూ కాం గ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత పేద లు, రైతులు, మహిళలు, కా ర్మికులు, సామాన్య ప్రజల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాల ను అమలు చేస్తోం దని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలలో భాగంగా పేదకు టుంబాలకు సన్న బియ్యం, ప్రతి నెల 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహి ళలకు ఉచిత బస్సు ప్రయాణం, అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డుల మంజూరు రైతులకు రుణమాఫీ వంటి పథకాలు ప్రజలకు ఎంతో ఉపయో గకరంగా ఉన్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత నిస్తూ తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తోందని మునిగెల నర్సింగ్ తెలి పారు. ప్రభు త్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లో కి తీసుకెళ్లేందుకు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపు నిచ్చారు.

**గుడిహత్నూర్ మండల ఐఎన్ టియుసి అధ్యక్షుడిగా రాజు నియామకం**

ఈ సందర్భంగా ఐ ఎన్ టి యు సి గుడిహత్నూర్ మండల అధ్య క్షుడిగా రాజుని నియమించారు. ఈ సంద ర్భంగా ఆయనకు నియామక పత్రాన్ని అందజేసి, కార్మి కులు, పేద ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నాయకులు సూచించా రు.ఐఎన్ టియుసిని మండల స్థాయిలో మరింత బలోపేతం చేస్తూ కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం పోరాడాలని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్ టి యుసి నాయకులు, కార్యక ర్తలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు.

## కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ వసతి గృహాన్ని తనిఖీ చేసిన ఎంపీడీవో అరుణ



**దిలావర్ పూర్, సెప్టెంబర్ 1,( ప్రజాజ్యోతి ).**దిలావర్పూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ వసతి గృహాన్ని మంగళవారం ఎంపీడీవో అరుణ రాణి తనిఖీ చేశారు ఈ సందర్భంగా వంటగదినిఆహార పదార్థాలను పరిశీలించారు వర్షాకాలం కాబట్టి ఆహారం పైన దోమలు ఈగలు వాలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి తెలిపారు. వసతి గృహంలోని లైటింగ్, కిటికీలకు జాలీలు,నీరు, మరుగుదొడ్లు, వంట సామగ్రి తదితర సౌకర్యాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించాలని, నాణ్యమైన శుభ్రమైన ఆహారం అందించాలని సిబ్బందికి సూచించారు. ఆహార ధాన్యాలు ఇతర సరుకులు మంచి స్థితిలో ఉన్నట్లు గుర్తించారు విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందేలా సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఎస్ ఓ ఆపరణ సిబ్బంది పాల్గొన్నారు

## అంబేద్కర్ నగర్ గణేష్ మండలి కమిటీ ఎన్నిక



**ఖానాపూర్ సెప్టెంబర్ 1( ప్రజా జ్యోతి)** ఖానాపూర్ పట్టణం అంబేద్కర్ నగర్ కాలనీకి చెందిన అంబేద్కర్ గణేష్ మండలి కమిటీని కాలనీవాసులు గణేష్ ఉత్సవాల సందర్భంగా మంగళవారం ఎన్నికల నిర్వహించుకుని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు

అధ్యక్షులు: రాకేం శేఖర్

కోశాధికారి :నల్ల.రవీందర్

ప్రధాన కార్యదర్శి : కత్తెరపాక.శ్రీధర్

ఉపాధ్యక్షులు:జన్నారపు తేజ

మైస ధనుష్

కార్యదర్శులు: ఎడ్ల.రాజ్ కుమార్

చిట్యాల గోవర్ధన్

కొంపెల్లి శివ సాయి

సహాయ కార్యదర్శులు: మైసపోశెట్టి

చిట్యాల రాజేశ్వర్

కార్యవర్గ సభ్యులు: శెట్టిపల్లి మనోహర్

మేసు శేఖర్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు జన్నారపు. శంకర్, మ్యాదరి. రాజేశ్వర్,దాసరి రాజేశ్వర్, చెట్పల్లి మోహన్ మేసు గంగేశ్వర్, కుంటాల గంగన్న, మునుగురి ప్రణీత్, పంబాల భరత్, చెటిపెల్లి వెంకటేష్, చెట్టిపల్లి రాజేశ్వర్, మారంపెల్లి విజయ్, జూకింది కళ్యాణ్ తుమ్మల శివకుమార్ తలారి వసంత్ బిక్కి వినోద్ తదితరులు పాల్గొన్నారు. రానున్న గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని శాంతియుతంగా విజయవంతంగా జరపాలని నిర్ణయించుకున్నారు

## భూ భారతి ప్రాజెక్టులో 636 మంది ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్ సే వలను పునరుద్ధరించాలి

**బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాద వ్‌కు ఎఫ్ టి ఎస్ సిబ్బంది వినతి**



**నేరడిగొండ, సెప్టెంబర్ 1 (ప్రజా జ్యోతి )** భూ భారతి ప్రాజెక్టులో విధులు నిర్వహిస్తున్న ఫీల్డ్ టె క్నికల్ స్టాఫ్ (ఎఫ్ టిఎస్) సి బ్బంది సేవలను 2026--27 ఆర్థిక సంవత్సరానికి పునరుద్ధరించడంతో పాటు, గతంలో ఉన్న 636 మంది సిబ్బంది మంజూరు బలాన్ని తిరిగి కొనసాగించేలా రానున్న అసెంబ్లీలో ప్రస్తావించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని మంగళవారం ఎఫ్ టి ఎస్ సిబ్బంది బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.భూ భారతి ప్రాజెక్టు ప్రారంభమైన నాటి నుంచి 2018 నుంచి రెవెన్యూ శాఖకు నిరంతరాయంగా సాంకేతిక సేవలు అందిస్తున్నామని, సిబ్బంది ఎమ్మెల్యే దృష్టికి తీ సుకువచ్చారు. ధరణి నుంచి భూ భారతి ప్రాజెక్టుకు మారిన అనంతరం కూడా తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ (టిజిటిఎస్) ఆధ్వర్యంలో తమ సేవలను కొనసాగిస్తున్నామని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ ఈ విషయాన్ని బీ ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ ఆర్ దృష్టికి తీసుకెళ్లి పార్టీ తరపున ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి ఎఫ్ టి ఎస్ సి బ్బందికి న్యాయం జరిగేలా తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హామీ ఇచ్చారు.

## సోనాల లో తుల అరుణ్ కుమార్ పుట్టినరోజు సంబరాలు



**సోనాల సెప్టెంబర్ 01 (ప్రజాజ్యోతి):** సోనాల మండల కేంద్రంలోని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇంటిలెక్చువల్ ఫోరం స్టేట్ కన్వీనర్తుల.అరుణ్ కుమార్ పుట్టినరోజు సంబరాలు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నిర్వహించడం జరిగింది. సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కేక్ కట్ చేసి వారి శుభాకాంక్షలు తెలియడం జరిగింది. సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తుల .అరుణ్ కుమార్ తన తండ్రి స్వర్గీయ తుల .సుభాష్ పేరు పై తుల .సుభాష్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా ఎన్నో సామాజిక కార్యక్రమాలు నిర్వహించి, విద్య పరమైన సహాయ సహకరణ అందించారు. అదిలాబాద్ జిల్లా గిరిజన ప్రాంతం రావడంతో విద్యపై ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించి మెడికల్ క్యాంపులు సైతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డిసిసి కార్యదర్శులులోలపు పోశెట్టి, చౌహాన్ హరి సింగ్ సర్పంచుల సంఘం అధ్యక్షులు చౌహాన్ వినోద్ సింగ్, డిసిసి ఎస్సీ భాగం జిల్లా ప్రధాన కార్యదర్శి భీంరావు పాటిల్, చింతల్ బోరి సర్పంచ్ గైక్వాడ్ శ్రీరామ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సోమన్న మునేశ్వర్, ఉప సర్పంచ్ అరవింద్ ,మాజీ సర్పంచ్ బలిరాం, సీనియర్ నాయకులు బాశెట్టి సుదర్శన్, మాధవ్ రావు పటేల్, మెస్రం. లాలూరామ్ హేమన్‌రావు, జ్ఞానేశ్వర్, పాండురంగ్, అంకుష్, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ, తెలంగాణ ఉద్యమ కారులకుసహాయం ప్రకటన

**సిఎం రేవంత్ రెడ్డి చిత్ర ఫటానికి పాలాభిషేకం**



**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెం బర్ 1, (ప్రజా జ్యోతి)** ఎస్సీ వర్గీకరణ తెలంగాణ ఉద్యమ కారులకు సహాయ సహకారాలు ప్రకటించిన నే పథ్యంలో హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం జిల్లా కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి చి త్రపటానికి పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డి పార్ట్ మెంట్ జిల్లా కార్యదర్శి బిక్కి గంగన్న, ఆదిమ కోలాం గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొడప సోనేరావు దళిత సంఘాల నాయకులు పాల్గొని పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం దళిత, తెలంగాణ, ఉద్య మకారుల పక్షపాతి అని రుజువైయిందని పేర్కొన్నారు. ఎస్సిల వర్గీకరణ, తెలంగాణ ఉద్యమ కారులకు 250 గజాల ఇంటి స్థలం, పెన్షన్, అంబేద్కర్ అభయ హస్తం క్రింద 12లక్షల రూపాయలుస్వయం ఉపాధి కోసం ఇచ్చేందుకు అంగీకరించడం హర్షనీయం అన్నారు.

## విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యాల పెంపునకు 'స్పోకెన్ ఇంగ్లీష్' పోటీలు

**విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించాలి**

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెం బర్ 1, (ప్రజా జ్యోతి )** విద్యార్థుల్లో ఆంగ్ల భాషా సంభాషణ నైపుణ్యాలను పెం పొందించడంతో పాటు వారిలో దాగి ఉన్న ప్రతిభను వె లికితీసేందుకు 'స్పోకెన్ ఇంగ్లీష్ రివ్యూ మీటింగ్ కమ్ కాంపిటీషన్స్' నిర్వహించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆగ స్టు 2026 నెలకు సంబంధించిన స్పోకెన్ ఇంగ్లీష్ కార్యక్ర మాల సమీక్షలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమా ని కి జిల్లా కలెక్టర్ రాజర్షి షా ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసం గించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేటి పో టీ ప్రపంచంలో ఆంగ్ల భాషపై పట్టు ఎంతో కీలకమని అన్నారు. విద్యార్థులు చిన్నత నం నుంచే ఇంగ్లీష్‌లో ధారాళంగా మాట్లాడే నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. పాఠశాలల్లో స్పోకెన్ ఇంగ్లీష్ బోధనను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని, విద్యార్థు ల్లో ఆంగ్ల భాషపై ఉన్న భయాన్ని తొలగించి ఆత్మవిశ్వాసం పెంపొందించేలా ఉపాధ్యా యులు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల ఆంగ్ల భాషా సామర్థ్యాలు, ఇప్పటివరకు సాధించిన పురోగతిపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. అనంతరం వివిధ విభాగాల్లో పోటీలు నిర్వ హించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కలెక్టర్ అభినందించి, మరింతగా రాణించేలా ప్రోత్సహించారు.అనంతరం పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కలెక్టర్ సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నా రు.

# బీజేపీ కార్యాలయాలు, నాయకులపై దాడులను తీవ్రంగా ఖండించిన ఎమ్మెల్యే పాయల్ శంకర్

## నల్గొండ బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డిని వాసంపై దాడి హేయమైన చర్య

## దాడులపై సమగ్ర దర్యాప్తు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెం బర్ 1, (ప్రజాజ్యోతి)** ప్రజాస్వామ్యంలో రాజకీయ భేదాభిప్రాయాలు సహజమేనని, అయితే రాజకీయ ప్రత్యర్థుల కార్యాలయాలపై దాడులు చేయడం, ఆస్తులను ధ్వంసం చేయడం, వ్యక్తులపై దాడులకు పాల్పడటం, మహనీయుల చిత్రాలను అవమానించడం ఏమాత్రం సమర్థనీయం కాదని ఆదిలాబాద్ ఎమ్మెల్యే, బీ జేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్ అన్నారు. తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యాలయం, నల్గొండ జిల్లా బీజేపీ కార్యాలయం, నల్గొండ జిల్లా బీజేపీ అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి నివాసంపై జరిగిన దాడులను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనలపై సమగ్రంగా, నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘీభావం తెలిపేందుకు వెళ్తున్న బీజేపీ నేతల అరెస్టులు ఖండనీయం అని, దాడులకు గురైన బీజేపీ నాయకులు, కార్యకర్తలకు సంఘీభావం, మద్దతు తెలిపేందుకు మంగళవారం వెళ్లేందుకు సిద్ధమైన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు, బీజేపీ ఫ్లోర్ లీడ ర్ మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి తదితర నాయకులను అరెస్ట్ చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని పాయల్ శంకర్ అన్నారు. దాడులకు గురైన తమ పార్టీ నాయకులు, కార్యకర్తలకు సంఘీ భావం తెలిపేందుకు వెళ్తున్న నాయకులను అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య హక్కులను అణచివేయడమేనని, అసలు దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాల్సింది పోయి, బాధితులకు మద్దతుగా



నిలిచేందుకు వెళ్తున్న బీజేపీ నాయకులను అరెస్ట్ చేయడం సరి కాదు" అని పాయల్ శంకర్ అన్నారు.ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం డీజీపీ కార్యాలయానికి వెళ్లి, రాష్ట్ర బీజేపీ నాయకులతో కలిసి జరిగిన ఘటనలపై సమగ్ర దర్యాప్తు జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ డీజీపీకి వినతిపత్రం అందించినట్లు పాయల్ శంకర్ తెలిపారు. నల్గొండ జిల్లా బీజేపీ కార్యాలయంపై సుమారు 50 మంది దాడికి పాల్పడినట్లు, అలాగే జిల్లా బీజేపీ అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి నివాసంపై దాడి చేసి వస్తువులను ధ్వంసం చేసినట్లు, ఆయన తల్లిపై దాడి చేసిగా యపరిచినట్లు వచ్చిన ఆరో పణలపై ప్రత్యేకంగా దర్యాప్తు చేయాలని కోరినట్లు




తెలిపారు. అదేవిధంగా సంత్ రవిదాస్ జీ చిత్రాన్ని అవ మానించిన ఘటనపై కూడా ప్రత్యేక దర్యాప్తు జరిపి, దర్యాప్తులో నేరం నిర్ధారణ అయితే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ చట్టంతో పాటు వర్తించే ఇతర చట్టాల ప్రకారం కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చట్టం ముందు అందరూ సమానమేనని, రాజకీయ ఒత్తిళ్లకు తావు లేకుండా పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని, దాడులకు పాల్పడిన ప్రతి ఒక్కరినీ గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలకు తగిన భద్రత క ల్పించాలని, బాధితులకు న్యాయం జరిగే వరకు బీజేపీ అండగా నిలుస్తుంది" అని పాయల్ శంకర్ స్పష్టం చేశారు.

# వాగ్దానాలను నెరవేరుస్తూ సంక్షేమం,అభివృద్ధిలో ముందుకు సాగుతున్న ప్రజాప్రభుత్వం

**కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రో జుల పాలన అత్యంత అద్భుతం**

**మాజీ ఎంపీ సోయం బాపూ రావు**

**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెం బర్ 1, (ప్రజా జ్యోతి)** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం 1000 రోజుల పాలనలో రాష్ట్రంలోని పేదలు, రైతులు, మహిళలు, యువత, బలహీన వర్గాల సంక్షేమం కోసం అనేక చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుని, ఇచ్చిన హామీలను ఒక్కొ క్కటిగా అమలు చేస్తోందని మాజీ ఎంపీ, రాజ్ గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపూ రావు అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఇచ్చిన అనే క హామీలు అమలు కాలేదని విమర్శించారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, రైతుల సంక్షేమం, నిరుద్యోగ భృతి వంటి అంశాల్లో ప్రజలను బీ ఆర్ ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని అన్నారు. అందుకే ప్రజలు బీఆర్ఎస్‌ను తిరస్కరించి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి అవకాశం కల్పించారని తెలిపారు.కాంగ్రెస్ ప్ర భుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల సంక్షే మం, రైతుల అభ్యున్నతి, మహిళల సాధికారత, విద్య, గృహ నిర్మాణం వంటి రంగాలకు అత్యంత ప్రాధా న్యత ఇస్తోందని సోయం బాపూరావు పేర్కొన్నారు. సొంత ఇళ్లులేని నిరుపేద కుటుంబాలకు అండగాని లుస్తూ, ప్రతి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు సుమా రు 4.5 లక్షల ఇళ్లను మం జూరు చేసిందని తెలిపారు గత ప్రభుత్వ హయాంలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న రేషన్ కార్డుల సమస్య ను పరిష్కరిస్తూ, అర్హులైన పేద కుటుంబాలకు పెద్ద ఎత్తున కొత్త రేషన్ కార్డులు అందిస్తున్నామని చెప్పారు.రైతుల సంక్షేమానికి అత్యం త ప్రాధాన్యత ఇస్తూ, అర్హు లైన రైతులకు రూ.2 లక్షల వరకు పంట రుణమాఫీ అమలు చేసి రైతులకు ఆర్థిక భరోసా కల్పించామని పేర్కొ న్నారు. రైతు సంక్షేమం, రైతు భరోసా తదితర కార్యక్ర మాలకు ప్రభుత్వం వేల కోట్ల రూపాయల నిధులు కేటాయించిందన్నారు. మహిళలకు ఆర్థిక స్వావలంబన, ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిం చేందుకు మహాలక్ష్మి పథకం ద్వారా రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం దేశంలోనే ఆదర్శంగా నిలిచిం దని సోయం బాపూ రావు అన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాల పై విద్యుత్ భారం తగ్గించేందుకు 200 యూనిట్ల వరకు ఉచి త విద్యుత్ అందిస్తూ ప్రజల ఇళ్లలో వెలుగులు నింపు తున్నామని తెలి పారు. మహిళలు, పేద కుటుంబాలకు ఉపశమనం కల్పించేలా గ్యా స్ సిలిండర్‌ను సబ్సి డీపై రూ.500కే అందించే పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు. పేద ప్రజలు కూడా నాణ్య మైన ఆహారం తీసుకోవాలనే లక్ష్యంతో అర్హులైనకు టుంబాలకు ఉచితంగా సన్న బియ్యం అందించే కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంద న్నారు.విద్యా రంగంలో ప్రభుత్వం చేపడు తున్న సంస్కరణలు, ప్రత్యే క కార్యక్రమాల ఫలితంగా తెలంగాణ విద్యాశాఖ జాతీయ స్థాయిలో మెరుగైన స్థానానికి చేరుకుందని సోయం బాపూరావు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నప్పటికీ రైతు లు, మహిళ లు, యువత, పేదలు, బల హీన వర్గాల సంక్షేమం విష యంలో రాజీ పడకుండా ముందుకు సాగుతోందని సోయం బాపూ రావు అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్య క్రమాలపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు కేవలం అసత్య ప్రచా రాలు మాత్రమేనని ఆయన కొట్టిపారేశారు.బీ ఆర్ ఎస్, బీజేపీ నాయ కులు ఎన్ని అసత్య ప్రచారాలు చేసినా ప్రజలు వాటిని నమ్మే పరిస్థితి లో లేరని, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉందని అన్నారు. రాబోయే రోజుల్లో కూడా ప్రజల ఆశీర్వాదంతో



కాంగ్రెస్ ప్రభుత్వం మరింత బలంగా ముందుకు సాగు తుందని, మరో రెండు పర్యా యాలు కాంగ్రెస్ ప్రజా ప్రభు త్వమే అధికారంలో ఉండటం ఖాయమని సోయం బాపూరావు ధీమా వ్యక్తం చేశారు.ఈ విలేకరుల సమావేశంలో బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆడే గజేందర్ మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, మాజీ డీసీసీ బీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, దామోదర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవ్ రెడ్డి, మాజీ డిసిసిబి చైర్మన్ ముడుపు దామోదర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతి నిధి బాలూరి గోవర్ధన్ రెడ్డి, ఆదిలాబాద్ ఆత్మ కమిటీ చై ర్మన్ గిమ్మ సంతోష్, మాజీ ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, మాజీ జెడ్పీటీసీ గణేష్ రెడ్డి, ఎస్సీ సెల్ చైర్మన్ పరమేశ్వ ర్, ఐ ఎన్ టి యు సి జిల్లా అధ్యక్షులు మునిగేల నర్సింగ్, జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీలు బండి దేవదాస్ చారి, అక్తర్ అలీ, లక్ష్మారెడ్డి, ధర్మపురి చంద్రశేఖర్, మందా కిని, ఓబీసీసెల్ జిల్లా అధ్య క్షులు అంబకంటి అశోక్, జిల్లా కాంగ్రెస్ కోశాధికారి హిమాభిషేక్ రెడ్డి,జిల్లా కాంగ్రెస్ సెక్రటరీలు ఇమ్రాన్ బేగ్, సి రాజ్, కాడే సంతోష్, సమో సాలు ఆదిలాబాద్ రూరల్ మండల అధ్యక్షుడు వెంకట్ సిరికొండ మండల అధ్యక్షుడు కంచం లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## మల్లికార్జున ఖర్గే సభాస్థలిని శుద్ధి ం చేసిన వారిపై చర్యలు



**లక్ష్మణ చాంద సెప్టెంబర్ 1 (ప్రజా జ్యోతి)** మల్లికార్జున ఖర్గే సభాస్థలినితో గంగాజలంతో శుద్ధి చేసిన బిజెపి నాయకుల పై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం రోజున స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దళిత నాయకుని సభాస్థలి గంగాజలంతో శుద్ధి చేయడం కుల వివక్షను చూపించ డమేనని ఫిర్యాదులో పేర్కొన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశలను దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే విధంగా బిజెపి నాయకులు వ్యవహరించడం సరైంది కాదని పేర్కొన్నారు. శుద్ధి చేసిన నాయకులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయాలని పరమేశ్వర్ కొలేట్కర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోండ్ర నరేష్ రెడ్డి, నిర్మల్ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు ఈటల శ్రీనివాస్ కాంగ్రెస్ మైనార్టీ అధ్యక్షులు అస్గర్, కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షులు వడ్నాల రాజేశ్వర్, మాజీ జెడ్పిటిసి ఓస రాజేశ్వర్, గంగాధర్ గౌడ్, తునికి నారాయణ, మోహన్,ఎస్సీ డిపార్ట్మెంట్ ఉపాధ్యక్షులు కాంబ్లే శివాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శులు మంథని సోనియా, లింగన్న, బాపట్ల ఆశన్న, శేఖర్, పుండ్ర నర్సింగ్, దయానంద్, టౌన్ అధ్యక్షులు చంద్రాల రాహుల్, గుడిహత్నూర్ అధ్యక్షులు దౌలత్ రావు, బండారి సతీష్, జిల్లా నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మూడు రోజుల పోరుబాట

బీ ఆర్ఎస్ మండల అధ్యక్షులు కృష్ణారెడ్డి



**లక్ష్మణ చాంద, సెప్టెంబర్ 1(ప్రజా జ్యోతి)** ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 2 నుంచి 4వ తేదీ వరకు మూడు రోజుల పాటు పోరుబాట కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ లక్ష్మణచందా మండల కన్వీనర్ కోరిపెల్లి కృష్ణారెడ్డి తెలిపారు. సెప్టెంబర్ 2న ఆరుగ్యారెంటీల వైఫల్యాల పై నిర్మల్ నియోజకవర్గ కేంద్రంలో ధర్నా, బాకీ కార్డుల పంపిణీతో పాటు 425 అడుగుల భారీ ఫ్లెక్సీ ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్ర మం రాంకిషన్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతుందని పేర్కొన్నారు. సెప్టెంబర్ 3న వ్యవసాయం, సాగునీటి రంగం, యూరియా కొరత, రైతు బీమా తదితర రైతుల సమస్యలపై ధర్నా చేపట్టను న్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 4న మహిళలకు నెలకు రూ.2,500, కేసీఆర్ కిట్, కల్యాణ లక్ష్మి, విద్యార్థులకు స్కూటీలు వంటి హామీలను అమలు చేయని ప్రభుత్వ వైఖరికి నిరసనగా నిర్మల్ జిల్లా కేంద్రంలో ధర్నా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మండ లంలోని ప్రతి గ్రామం నుంచి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయ కులు, కార్యకర్తలు, రైతులు, మహిళలు అభిమానులు పెద్ద సంఖ్య లో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కృష్ణారెడ్డి తెలిపారు.

## పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ఇందిరమ్మ ఇల్లు



**లక్ష్మణ చాంద, సెప్టెంబర్ 1 (ప్రజా జ్యోతి)** మండలంలోని కనకాపూర్ గ్రామంలో మంగళవారం రోజున నూతనంగా సాంక్షన్ అయిన ఇందిరమ్మ గృహాలకు కాంగ్రెస్ నాయకులు భూమి పూజ చేశారు. ముఖ్యఅతిథిగా వచ్చిన నిర్మల్ మార్కెట్ కమిటీ అధ్యక్షులు సోంభీమ్ రెడ్డి మాట్లాడుతూ పేద మధ్య తరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు కోండ్ర నరేష్ రెడ్డి, పి ఎస్ సి ఎస్ చైర్మన్ ఎర్ర రఘునందన్ రెడ్డి, నిర్మల్ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు ఈటల శ్రీనివాస్, కనకాపూర్ గ్రామ సర్పంచ్ రాజ్యలక్ష్మి రాజు, ఉప సర్పంచ్ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాకేష్, ప్రమోద్, కప్పగంటి మోహన్, మల్లికార్జున్, రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## జాకిరిగూడలో వెలుగుల పండుగ..

**20 నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు**



**సిరికొండ, సెప్టెంబర్ 1 (ప్రజాజ్యోతి)** సిరికొండ గ్రామపంచాయతీ పరిధిలోని జాకిరిగూడ గ్రామంలో దీర్ఘకాలంగా ఉన్న విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించింది.సర్పంచ్ బొడ్డు దత్తాత్రి ఉప సర్పంచ్ తోకల రాజు మరియు వార్డ్ మెంబర్ జాకిరిగూడ పటేల్ (భీంరావ్ పటేల్) గారి ప్రత్యేక చొరవతో, సమస్యను విద్యుత్ సిబ్బంది విష్ణు, నందు దృష్టికి తీసుకెళ్లగా.. వారు వెంటనే స్పందించి మంగళవారం గ్రామంలో 20 నూతన విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేసారు.ఎన్నో ఏళ్ల సమస్యను వెంటనే పరిష్కరించిన ప్రజాప్రతినిధులకు, విద్యుత్ సిబ్బందికి గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాజేష్, తిరుపతి మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఘణంగా కామ్రేడ్ రాదక్కకు అంతిమ వీడ్కోలు

### మాజీ మావోయిస్టు నేత రాధక్క అంతిమ యాత్రకు హాజరైన మాజీ అగ్రనేతలు

### అశ్రు నయనాల మద్యస్వ గ్రామంలో రాధక్క అంత్యక్రియలు







**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెం బర్ 1, (ప్రజా జ్యోతి )** మాజి తొలితరం మవోయిస్టు మహిళా నేత, కామ్రేడ్ కుర్సంగె మోతి బాయి, అలియాస్ రాధక్కకు ఘనంగా నివాళిలు అర్పించారు. విప్లవ,జోహార్లు, తెలిపిన వారిలో ఉద్యమ సహచరులు, బంధుమిత్రులు, విప్లవ సాను భూతిపరులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు ప్రయత్నం రాధక్కకు అంతిమ వీడ్కోలు పలికారు.మంగళవారం అదిలాబా ద్ జిల్లా ఆదిలాబాద్ రూరల్ మండలంలోని లింగు గూడలో కామ్రేడ్ రాదక్క అంతి మయాత్ర నిర్వహించారు. లింగూగూడ, గ్రామం, మండలం, జిల్లా, ఆదిలాబాద్‌లో మధ్యాహ్నం 12-30గంటల నుండి మధ్యా హ్నం 3-00 గంటల వరకు అంత్యక్రియలు జరిగాయి. సోమవారం ఆనారో గ్యంతో ఆదిలాబాద్ ప్రభుత్వ రిమ్స్ కళాశాల ఆసుపత్రిలో మరణిం చిన రాదాక్కఏకుర్సంగె మోతి బాయి మృతదేహానికి తనస్వ గ్రామం లింగూగూడలో మంగళవారం కుటుంబ సభ్యులు, సహచరుడు పు ల్లూరి ప్రసాద్ రావుఏ చంద్రన్న, మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు దేవుజీ(తిప్పిరి తిరుపతి), బడేచొక్కారావు(దామోదర్), కంకణాల రాజి రెడ్డి, బండి ప్రకాష్, జె ఎన్ ఎం సంజీవ్, ఆజాద్, అప్పాసి నారాయణ మహమ్మద్ హుస్సేన్, పలు పూర్వ మా వోయిస్టు ఉద్యమ కారులు, ప్రవీణ్, ఎస్సీ/ఎస్టీ కమిషన్, తెలంగాణ రాష్ట్ర సభ్యుడు, వివిధ రాజకీయ పక్షాల నాయ కులు,అమరుల బంధుమిత్రుల సంఘం, ప్రజా సంఘాల,పౌర హక్కుల, ఉపాధ్యా య సంఘాల నాయకులు, జర్నలిస్ట్ సంఘాల నాయకులు, రచయిత లు, కవులు, కళాకారులు, తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం,తెలంగాణ మున్సిపాలి టీ కాంట్రాక్టు కార్మిక సంఘం, నాయకు లు, తెలంగాణ ఉద్యమ కారులు, న్యాయ వాదులు నివాళులు ఘణంగా అర్పించి అంత్యక్రియలు నిర్వహిం చారు. విప్లవో ధ్యమంలో దాదాపు మూడు దశబ్దాలు పని చేసిన భారత పిడిత ప్రజానీకానికి విశేష మైన సేవా లాంధించిన కామ్రేడ్ రాధాక్క (కుర్సంగె మోతిబాయి) ఆశయాలు కొనసాగించాలని వక్తలు పిలుపునిచ్చారు.

# న్యాయం జరిగే వరకు పోరాటం

:టైగర్స్ దినకర్, కార్తీక్

నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలి

కుమురంభీం చౌరస్తాలో ప్రజా సంఘాల భారీ నిరసన

**ఆసిఫాబాద్ ఆర్సీ, సెప్టెంబర్ 1 (ప్రజాజ్యోతి):**ఆదివాసీ గిరిజన ఆడబిడ్డపై జరిగిన అత్యాచారం, హత్య ఘటనపై ప్రజా సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. (ష) కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. ఘటనకు బాధ్యులైన నిందితులను వెంటనే గుర్తించి అరెస్టు చేయాలని, కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు అప్పగించి వేగవంతమైన విచారణ చేపట్టి చట్ట ప్రకారం కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కుమురంభీం చౌరస్తాలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేస్తూ ఘటనపై తమ నిరసనను వ్యక్తం చేశారు. మహిళలు, బాలికలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వ యంత్రాంగం మరింత అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

**ఘటనపై ప్రభుత్వ స్పందన ఏదీ?**

ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి గోడిసెల కార్తీక్, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నేర్పల్లి అశోక్, ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి నంది పద్మ మాట్లాడుతూ.. మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు జరుగుతున్నప్పటికీ వాటిని అరికట్టేందుకు ప్రభుత్వాలు మరింత కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. ఘటనపై ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేసే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. నిందితులు ఎంతటి వారైనా చట్టం ముందు సమానులేనని, దర్యాప్తులో ఎలాంటి రాజకీయ లేదా ఇతర ఒత్తిళ్లకు తావులేకుండా నిష్పక్షపాతంగా విచారణ జరపాలని నాయకులు డిమాండ్ చేశారు. కేసు దర్యాప్తును వేగవంతం చేసి ఆధారాలను పకడ్బందీగా సేకరించాలని, బాధ్యులు చట్టం నుంచి తప్పించుకునే అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

**బాధిత కుటుంబానికి అండగా నిలవాలి**

కుటుంబం తీవ్ర విషాదంలో ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం వారికి తక్షణ ఆర్థిక సహాయం అందించాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. కుటుంబానికి అవసరమైన న్యాయ సహాయం, రక్షణ కల్పించడంతో పాటు ప్రభుత్వ పరంగా అందాల్సిన అన్ని సహాయాలను వెంటనే అందించాలని విజ్ఞప్తి చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవడం ద్వారా వారికి భరోసా కల్పించాలని పేర్కొన్నారు.

**మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి**

మహిళలు, బాలికలపై నేరాలను అరికట్టేందుకు కేవలం ఘటన జరిగిన తర్వాత స్పందించడం కాకుండా ముందస్తు చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని నాయకులు సూచించారు. మారుమూల గ్రామాలు, ఆదివాసీ ప్రాంతాల్లో మహిళల భద్రతకు ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేయాలని, ఫిర్యాదులపై పోలీసులు వేగంగా స్పందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అఘాయిత్యాలకు




పాల్పడే వారికి కఠిన శిక్షలు పడేలా చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాలని, బాధితులకు సత్వర న్యాయం అందేలా ప్రత్యేక న్యాయ ప్రక్రియను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. శిరీష కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు ప్రజా సంఘాలు అండగా ఉంటాయని నాయకులు స్పష్టం చేశారు. నిరసన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్, సహాయ కార్యదర్శి శ్రీకాంత్, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కోట శ్రీనివాస్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దుర్గం రాజ్‌కుమార్, కోశాధికారి నిఖిల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయం చేయాలని, నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు.

# పెండింగ్ భూ సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించాలి






## జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,సెప్టెంబర్ 1 ,( ప్రజాజ్యోతి ).**నిర్మల్ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో భూభారతి, భూముల సర్వే--రీ-సర్వే, నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ, సీఎంఆర్ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.మండలాల వారీగా పెండింగ్ భూ సమస్యలపై తహసీల్దార్లను వివరాలు అడిగి తెలుసుకున్న కలెక్టర్, ముఖ్యంగా 22-ఏ కింద ఉన్న భూ వివాదాలను ఎప్పటికప్పుడు పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. భూముల సర్వే, రీ-సర్వే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. గ్రామసభలు నిర్వహించిన అనంతరమే రీ-సర్వే ప్రారంభించాలని, గ్రామసభలకు సంబంధించిన రికార్డులను పక్కాగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. సర్వే పనులను వేగవంతం చేసేందుకు అదనంగా ఐదు అధునాతన సర్వే యంత్రాలను అందిస్తున్నట్లు తెలిపారు. సర్వే వివరాలను ప్రతిరోజూ నమోదు చేస్తూ, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.జిల్లాలో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని వేగవంతం చేసి, రేషన్ డీలర్ల వారీగా అర్హులైన ప్రతి ఒక్కరికీ కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సీఎంఆర్ ప్రక్రియను నిర్దేశిత గడువులో పకడ్బందీగా పూర్తి చేయాలని, రైస్ మిల్లులను అధికారులు నిరంతరం తనిఖీ చేయాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డీఆర్వో రాథోడ్ రమేష్, డిప్యూటీ కలెక్టర్ రాకేష్, ఆర్డీవో దేవీదాస్, సంబంధిత అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

